కలం నిఘా
WWW.KALAMNIGHA.COM
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ శనివారం 14 డిసెంబర్ 2024
సంపుటి: 14, సంచిక: 255, పేజీలు 8, వెల: 4.00
Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam

## అల్లు అరెస్టులో తన ప్రమేయం లేదు

మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్



2



2

## చేసేదంతా చేసి అధికారులను బలి చేసిన రేవంత్

రైతులంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి గౌరవం లేదు: కేటీఆర్

# కేటీఆర్ అవినీతిపై విచారణకు గవర్నర్ అనుమతులు

### ఫార్ములా ఈ-కారు రేసు నిర్వహణలో ఆరోపణలు.. విచారణకు సన్నద్ధమవుతున్న ఏసీబీ



హైదరాబాద్ డిసెంబర్ 13 (నిఘా న్యూస్): తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటు చేసుకోనుంది. ఫార్ములా ఈ-కారు రేసులో అవినీతి ఆరోపణల నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. దీంతో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఆయనను విచారించేందుకు సన్నద్ధం అవుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ వేదికగా గతేడాది ఫిబ్రవరిలో ఫార్ములా ఈ-కారు రేస్ జరిగిన విషయం తెలిసిందే. అయితే, ఈ ఫార్ములా ఈ-కారు రేసు నిధుల కేటాయింపులలో భారీ అవినీతి జరిగినట్లు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ సంస్థ ఏసీబీకి ఫిర్యాదు చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటికే ఉన్న ఇద్దరు పురపాలక శాఖ అధికారులతో పాటు అప్పట్లో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్‌పై కేసు నమోదు చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఏసీబీ కాంగ్రెస్ ప్రభుత్వానికి లేఖ రాసింది. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఇద్దరు అధికారులపై విచారణకు అనుమతించింది. అలాగే ప్రజాప్రతినిధిగా ఉన్న కేటీఆర్‌పై కేసు నమోదు కోసం అనుమతి ఇవ్వాలని గవర్నర్‌ను కోరింది. దీనిపై న్యాయ సలహా మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కేటీఆర్‌ను విచారించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.



# పుష్ప అరెస్టు

### అల్లు అర్జున్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన కోర్టు

గాంధీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు

చంచల్‌గూడ జైలుకు తరలింపు

పుష్ప అరెస్ట్‌పై పిటిషనర్ ఆందోళన

కేసు ఉపసంహరించుకుంటానని వీడియో విడుదల

హైదరాబాద్ డిసెంబర్ 13(నిఘా న్యూస్): సినీ నటుడు అల్లు అర్జున్ వ్యవహారంలో రోజంతా హైడ్రామా నడిచింది. ఆయనను అరెస్ట్ చేయడం, చంచల్‌గూడ జైలుకు తరలించడం, వెంటనే హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడం వంటివన్నీ చకచకా సాగిపోయాయి. అరెస్ట్ చేసి జైలుకు తరలించిన అనంతరం తెలంగాణ హైకోర్టులో అల్లు అర్జున్‌కు ఊరట లభించింది. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో ఆయన అరెస్టయిన క్రమంలో అల్లు అర్జున్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం నాలుగు వారాల పాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అల్లు అర్జున్ ఏ11గా పేర్కొన్న పోలీసులు. మధ్యాహ్నం 1.30కి అరెస్టు చేసినట్లు రిమాండ్ రిపోర్టులో వెల్లడిరచారు. క్వాష్ పిటిషన్‌పై విచారణ అత్యవసరం కాదని.. సోమవారం వినాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టును కోరారు. అల్లు అర్జున్ అరెస్టయి నందున బెయిల్ కోసం అవసరమైతే మరో పిటిషన్ వేసుకోవాలన్నారు. క్వాష్ పిటిషన్‌లోనే మధ్యంతర బెయిల్ ఇవ్వాలని అల్లు అర్జున్ తరఫు న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదనలు ..మిగతా 2లో

## రేవంత్ వినతులకు...

# కేంద్రం సానుకూలం!

### కేంద్ర మంత్రులతో ఢిల్లీలో ముఖ్యమంత్రి వరుస భేటీలు

- నిధుల విడుదలలో కేంద్రం చొరవ చూపాలి
- పెండింగ్‌లో ఉన్న 1800 కోట్లు తక్షణమే ఇవ్వండి
- ఏపీ నుండి వచ్చే రూ.408 కోట్లను ఇప్పించండి
- రూ. 2,547.07 కోట్ల రికవరీ ఆదేశాలు ఏకపక్షం
- మరోసారి సమీక్షించి సరైన నిర్ణయం తీసుకోవాలి
- నిర్మలా సీతారామన్‌ను కోరిన రేవంత్ రెడ్డి
- కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసం విజ్ఞప్తి





న్యూఢిల్లీ డిసెంబర్ 13 (నిఘా న్యూస్): తెలంగాణకు రావాల్సిన నిధులు అందేలా చూడాలని కేంద్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులను కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో కేంద్రం చొరవ చూపాలని సీఎం ప్రత్యేకంగా కేంద్రాన్ని కోరారు. రాజస్థాన్ పర్యటన పూర్తి చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రులతో వరుసగా భేటీ అయ్యారు. ప్రధానంగా తెలంగాణ నిధులు, రైల్వే ప్రాజెక్ట పూర్తి, పలు అంశాలపై సీఎం రేవంత్ సుధీర్ఘ చర్చలు జరిపారు. కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ తో భేటీ కాగా, పెండిరగ్ లో ఉన్న రైల్వే ప్రాజెక్ట్ లపై సీఎం చర్చించారు. అందులో కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని, వికారాబాద్, కృష్ణ స్టేషన్ల మధ్య పూర్తిగా రైల్వే శాఖ వ్యయంతో నూతన రైలుమార్గం నిర్మించాలని కోరారు. అనంతరం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్‌తో భేటీ కాగా కీలక అంశాలపై చర్చ సాగింది. వెనక బడిన జిల్లాలకు పునర్విభజన చట్ట ప్రకారం ఇవ్వాల్సిన నిధులను వెంటనే తెలంగాణకు ..మిగతా 2లో

ఒక్కరి కోసం 142 కోట్ల భారతీయుల

## ప్రయోజనాలు బలి

రాజ్యాంగం అంటే సంఘ్ బుక్ కాదు

ఎందరో మహానుభావుల అనుభవ సారం

లోక్‌సభలో రాజ్యంగంపై చర్చలో ప్రియాంక



న్యూఢిల్లీ డిసెంబర్ 13 (నిఘా న్యూస్): భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకొని 75వ ఏడాదిలోకి అడుగుపెట్టిన సందర్భంగా లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరుగుతోంది. జమిలిపైనా ప్రభుత్వం ముందుడుగు వేయడంతో వాడీవేడీగా చర్చ సాగింది. ఎందరో మహానుభావుల అనుభవ సారం ..మిగతా 2లో

చాయివాలా ప్రధాని...

## ఆటోవాలా ముఖ్యమంత్రి



భారత రాష్ట్రపతిగా గిరిజన మహిళ

ఇది భారత రాజ్యాంగం గొప్పధనం

లోక్ సభలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

2

## జీరో పావర్టి లక్ష్యంగా...

# స్వర్ణాంధ్ర 2047 డాక్యుమెంట్



తెలుగు జాతిని ఉన్నత స్థానంలో నిలపడమే లక్ష్యం

ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా భారత్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అమరావతి డిసెంబర్ 13(నిఘా న్యూస్): అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తూ, విజన్ డాక్యుమెంట్ తీసుకురావడం తమ అకుంఠిత దీక్షకు నిదర్శనమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఈ మహా సంకల్పంలో భాగస్వాముల్కెన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు. చారిత్రక సమావేశానికి ..మిగతా 2లో



నాలుగు సంవత్సరాలలో...

## 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు

పేదవారి చిరకాల కోరిక

సొంతింటి కలను తీర్చే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిది

సంక్రాంతి నాటికి ఇందిరమ్మ ఇంటి నిర్మాణ నమూనా పూర్తి

డిసెంబర్ చివరి కల్లా ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తి

కూసుమంచి పర్యటనలో మంత్రి పొంగులేటి

2

## పరారీలో నటుడు మోహన్ బాబు?



మోహన్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురు

ముందస్తు బెయిల్ పిటిషన్ వాయిదా

జర్నలిస్టుపై దాడి ఘటనలో హత్యాయత్నం కేసు నమోదు

2

## బంగ్లాదేశ్‌లో హిందువుల పరిస్థితి ఆందోళనకరం

హిందువుల రక్షణ బాధ్యత యూనస్ ప్రభుత్వానిదే

లోక్‌సభలో విదేశాంగ మంత్రి జైశంకర్



2



## రేవంత్ వినతులకు... కేంద్రం సానుకూలం!

మొదటి పేజీ తరువాయి...

విడుదల చేసేలా చూడాలని కేంద్ర మంత్రికి సీఎం సూచించారు. నాలుగేళ్ల నుండి పెండింగ్ లో ఉన్న రూ. 1800 కోట్లు తక్షణం విడుదల చేయాలన్నారు. ఉమ్మడి సంస్థల నిర్వహణ వ్యయం రూ.408 కోట్లను ఆంధ్రప్రదేశ్ నుండి ఇప్పించాలని కేంద్రాన్ని కోరారు. విదేశీ ఆర్థిక సహాయంతో చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య రుణాల పంపిణీ విషయంలో తెలంగాణ నుండి ఏకపక్షంగా రూ. 2,547.07 కోట్ల రికవరీకి కేంద్రం ఏకపక్ష ఆదేశాలు పై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు సీఎం. అలాగే ఈ విషయంలో మరోసారి సమీక్షించి సరైన నిర్ణయం తీసుకోవాలని వినతి పత్రాన్ని కూడా సీఎం అందజేశారు. అయితే కేంద్రాన్ని సీఎం కోరగా, సానుకూల స్పందన వచ్చినట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా తెలంగాణ పట్ల వివక్ష చూపకుండా, రాష్ట్రానికి రావాల్సిన నిధులు త్వరితగతిన అందేలా చూడాలని సీఎం కోరారు. సీఎం వెంట తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు కూడా భేటీలో పాల్గొని తమ వాణి వినిపించారు.

## చాయివాలా ప్రధాని... ఆటోవాలా ముఖ్యమంత్రి

న్యూఢిల్లీ డిసెంబర్ 13 (నిఘా న్యూస్): భారత రాజ్యాంగం ఎంతో గొప్పదని, ప్రపంచానికి భారత రాజ్యాంగం ఆదర్శంగా నిలిచిందని, అన్ని వర్గాలకు రాజ్యాంగం రక్షణగా నిలిచిందని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఆలోచన అద్భుతం అని, ఆయన నేతృత్వంలో రచించిన భారత రాజ్యాంగం వెలకట్టలేనిదని నంద్యాల పార్లమెంట్ సభ్యులు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. శుక్రవారం లోక్ సభలో భారత రాజ్యాంగంపై ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు. మన రాజ్యాంగం వల్లే నేడు గిరిజన మహిళ భారత ప్రథమ పౌరురాలుగా (రాష్ట్రపతిగా) చాయ్ వాలా భారత ప్రధానమంత్రి గా, ఆటోవాలా ఏపీ ముఖ్యమంత్రిగా కాగలిగారు అంటే భారత రాజ్యాంగం గొప్పదనం అని లోక్ సభలో బైరెడ్డి శబరి వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడిందని ఆమె ఆరోపించారు.



## ఒక్కరి కోసం 142 కోట్ల భారతీయుల ప్రయోజనాలు బలి

మొదటి పేజీ తరువాయి...

మన రాజ్యాంగం అని అన్నారు. ఇందులో విపక్షాల తరఫున కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా చర్చను ప్రారంభించారు. ఎంపీగా ఇటీవలే పార్లమెంట్‌లో అడుగుపెట్టిన ఆమె లోక్‌సభలో ప్రసంగం చేయడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికార భాజపా, ఆరెస్సెస్‌పై విమర్శలు చేశారు. రాజ్యాంగం అంటే సంఘ్ బుక్ కాదని ఆర్‌ఎస్‌ఎస్‌ను ఉద్దేశించి దుయ్యబట్టారు. భాజపా ఎల్లప్పుడూ గతం గురించే మాట్లాడుతుంది. కానీ, దేశ ప్రగతి కోసం ఇప్పుడేం చేస్తున్నారో వారు మాట్లాడాలన్నారు. దేశంలో జరిగే అన్నిటికీ నెహ్రూనే కారణమా, నెహ్రూ పేరును, ఆయన ప్రసంగాలను మీరు పుస్తకాల నుంచి తొలగించగలరేమో.. కానీ, స్వతంత్ర్య పోరాటంలో, జాతి నిర్మాణంలో ఆయన పాత్రను చెరిపేయలేరని ప్రియాంక కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా 2017లో జరిగిన ఉన్నావ్ అత్యాచార ఘటనను ఆమె ప్రస్తావించారు. ఇలాంటి ఘటనల్లో బాధితులకు పోరాడే హక్కును రాజ్యాంగమే కల్పించిందన్నారు. ఈ సందర్భంగా అదానీ వ్యవహారంపై కాంగ్రెస్ ఎంపీ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. 'ఒక్కరిని కాపాడటం కోసం 142 కోట్ల మంది భారతీయుల ప్రయోజనాలను విస్మరిస్తున్నారు. సంపద, రోడ్లు, పోర్టులు, గనులు అన్నీ ఆయనకే ఇస్తున్నారని మండిపడ్డారు. ప్రజల తరఫున పోరాడే ప్రతిపక్షాల గళాన్ని అణచివేసేందుకు తప్పుడు కేసులు పెడుతున్నారని దుయ్యబట్టారు. దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేసి విపక్ష నేతలపై వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇతర దేశాలతో పోలిస్తే మన స్వాతంత్య పోరాటం ప్రత్యేకమైనది. సత్యం, అహింస అనే పునాదులపైనే మనం పోరాడాం. మన స్వాతంత్య ఉద్యమం ప్రజాస్వామ్య గళం. దాన్నుంచి ఉద్భవించినదే రాజ్యాంగం. ఇది కేవలం డాక్యుమెంట్ కాదు, అంబేడ్కర్, మౌలానా ఆజాద్, రాజగోపాలచారి, నెహ్రూ వంటి ఎంతోమంది నేతలు ఎన్నో ఏళ్ల పాటు తమ జీవితాలను అంకితం చేసి దీన్ని రూపొందించారు. ప్రజా హక్కులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తే శక్తిని రాజ్యాంగం మనకు కల్పించింది. ఇది దేశ ప్రజలను కాపాడే 'సురక్షా కవచంలా ఉంది. అయితే దీన్ని బద్దలు కొట్టేందుకు అధికార ఎన్డీయే ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసింది. గత పదేళ్లలో ఈ రక్షణ కవచాన్ని బలహీనపర్చింది. లేట్రల్ ఎంట్రీ, ప్రైవేటీకరణ వంటి చర్యలతో రిజర్వేషన్లను బలహీనపర్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ మెజార్టీ వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చాలని ఎన్డీయే భావించింది. అది జరగకపోవడంతో ఆ ప్రతిపాదనలపై వెనక్కి తగ్గింది. ఇది సంవిధాన్.. సంఘ్ రూల్ బుక్ కాదు' అని కాంగ్రెస్ ఎంపీ దుయ్యబట్టారు. కులగణన జరగాలని దేశ ప్రజలంతా కోరుకుంటున్నారని తెలిపారు.

## పరారీలో నటుడు మోహన్ బాబు?

హైదరాబాద్ డిసెంబర్ 13 (నిఘా న్యూస్): నటుడు మోహన్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురైంది. జర్నలిస్టుపై దాడి ఘటనలో మోహన్‌బాబు వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు న్యాయస్థానం తిరస్కరించింది. జల్‌పల్లిలోని మోహన్ బాబు ఇంటి వద్ద జరిగిన ఘర్షణపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో పోలీసులు తదుపరి దర్యాప్తు చేపట్టకుండా, తనను అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆయన పిటిషన్ వేశారు. అయితే మోహన్‌బాబు అభ్యర్థనను ఉన్నత న్యాయస్థానం తిరస్కరించింది. పిటిషన్‌పై తదుపరి విచారణను న్యాయస్థానం గురువారానికి వాయిదా వేసింది.

# జీరో పావర్టి లక్ష్యంగా స్వర్ణాంధ్ర 2047 డాక్యుమెంట్

మొదటి పేజీ తరువాయి...

హాజరైన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా ఎదుగుతోందని అన్నారు. 2047లో మనం వందేళ్ల స్వాతంత్ర్య ఉత్సవాలు జరపుకుంటామని, ఆ నాటికి భారతదేశం అగ్రదేశంగా మారాలనే లక్ష్యంతో వికసిత్ భారత్-2047ను కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందని చంద్రబాబు వివరించారు. ఇందులో భాగంగా రాష్ట్రం కూడా ఒక స్పష్టమైన లక్ష్యంతో స్వర్ణాంధ్ర-2047ను విజన్ డాక్యుమెంట్ రూపొందించుకుందని వ్యాఖ్యానించారు. 'పది సూత్రాల వృద్ధి సోపానాలతో విలువైన విజన్ సాక్షాత్కరించింది. పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నైపుణ్యం-మానవ వనరుల అభివృద్ధి, ఇంటింటికీ నీటి భద్రత, రైతు-వ్యవసాయ సాంకేతికత, ప్రపంచస్థాయి పంపిణీ వ్యవస్థ (లాజిస్టిక్స్), శక్తి-ఇంధనాల వ్యయ నియంత్రణ, అన్ని రంగాల్లో పరిపూర్ణ ఉత్పాదన, సమగ్ర విధానాలతో స్వచ్ఛాంధ్ర, అన్ని దశల్లో సమగ్ర సాంకేతికత మార్గదర్శక సూత్రాల నవపథం ఆవిష్కృతమైంది' అని చంద్రబాబు వివరించారు.నేను 1978 నుంచి అనేక ఎన్నికల్లో పోటీచేశాను. కానీ, 93 శాతం సక్సెస్ రేటు, 57 శాతం ఓటు బదిలీని 2024 ఎన్నికల్లో మాత్రమే చూశాను పవన్ కళ్యాణ్ వంటి మంచి మిత్రుడు ఉండటం చాలా సంతోషంగా ఉంది. పాలన



చేపట్టాక చూస్తుంటే మా ఊహలకన్నా ఎక్కువ విధ్వంసం జరిగిందని తెలిసింది. గాడితప్పిన పరిపాలనను చక్కదిద్దుకుంటూ ముందుకెళ్తున్నాం. ప్రస్తుతం మన రాష్ట్రంలో తలసరి ఆదాయం మూడువేల డాలర్ల కంటే తక్కువగా ఉంది. 2047 నాటికి తలసరి ఆదాయాన్ని 42 వేల డాలర్లకు చేర్చాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'హైదరాబాద్‌లో హైటెక్‌సిటీ ప్రాంతానికి వెళ్లినప్పుడల్లా మేమందరం రాళ్లు మాత్రమే చూశాం. మీరు మాత్రం అందులో ఒక విజన్ చూశారని పవన్ కళ్యాణ్ ఎప్పుడూ అంటుంటారన్నారు. ఆ రోజు అక్కడ ఒక సింగపూర్‌ను, దుబాయ్‌ను చూశా. న్యూయార్క్ వంటి నగరాన్ని ఎందుకు అభివృద్ధి చేయకూడదనే ఆలోచన చేసి, ముందుకెళ్లాను. ఆనాడు చేసిన విజన్, పునాది కారణంగా హైదరాబాద్ నగరం, తెలంగాణ రాష్ట్రం భారతదేశంలో ఎక్కువ తలసరి ఆదాయం సంపాదించే రాష్ట్రంగా తయారైందని చెప్పడానికి గర్వంగా ఉంది' అని చంద్రబాబు చెప్పారు.'మన దగ్గర మెరికల్లాంటి యువత ఉన్నారు. తిరుగులేని మానవ వనరులు, సహజ వనరులు, నదులు, సముద్రతీరం ఉన్నాయి. వీటన్నింటినీ సక్రమంగా ఉపయోగించుకుంటే ఏదైనా సాధ్యమే. వెల్తీ, హెల్తీ, హ్యాపీ సొసైటీ ఉండాలనే లక్ష్యంతో పది సూత్రాలతో స్వర్ణాంధ్ర - 2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాం. సమాజమే దేవాలయ,పేదలే దేవుళ్లు అని చెప్పిన వ్యక్తి ఎన్టీఆర్.. ఆ స్ఫూర్తితోనే నేడు జీరో పావర్టీ కోసం సంకల్పించాం' అని చంద్రబాబు స్పష్టం చేశారు.

## నాలుగు సంవత్సరాలలో... 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు

కూసుమంచి డిసెంబర్ 13(నిఘా న్యూస్): రాబోయే సంక్రాంతి నాటికి కూసుమంచి మండలంలో మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి అవుతుందని తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ తో కలిసి కూసుమంచి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఐదు లక్షల రూపాయల అంచనా విలువతో చేపట్టనున్న ఇందిరమ్మ ఇళ్లు మోడల్ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం గడిచిన నేపథ్యంలో ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్, రాజధాని హైదరాబాద్ లో ఘనంగా ఉత్సవాలు జరుపుకున్నామని, ఇందులో భాగంగా రాబోయే నాలుగు సంవత్సరాలలో పేదవాడి సొంతింటి కల నెరవేర్చే దిశగా ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమం నెరవేర్చేందుకు డిసెంబర్ 5న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా యాప్ ప్రారంభించుకున్నామని అన్నారు.ప్రభుత్వం ఏర్పడగానే చేపట్టిన ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 80 లక్షల మంది ఇందిరమ్మ ఇండ్ల పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారని, వీటిలో అర్హులైన దరఖాస్తులను ఎంపిక చేసి మొదటి విడత ప్రభుత్వం మంజూరు చేసే నాలుగున్నర లక్షల ఇండ్ల క్రింద ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా పేదలు ప్రస్తుతం నివసించే గుడిసె, షెడ్డు, టార్పాలిన్ కవర్ ఇళ్లు ఫోటో తీసుకొని వివరాలు నమోదు చేయడం జరుగుతుందని,యాప్ లో నమోదు చేసిన వివరాల ప్రకారం బహు పేదలను ఎంపిక చేసి మొదటి విడత లబ్ది చేకూరుస్తామని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల క్రింద సొంత ఇంటి స్థలం ఉన్నవారికి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం 4 విడతలలో అందుతుందని, ఫౌండేషన్ వేసిన తర్వాత లక్ష రూపాయలు, కిటికిల స్థాయికి చేరగానే లక్షా పాతిక వేలు, స్లాబ్ దశ చేరిన తర్వాత లక్ష 75 వేల రూపాయలు, ఇండ్లు పూర్తి చేసిన తర్వాత మరో లక్ష రూపాయల సహాయం అందుతుందని, ప్రతి దశలో ఇంటి నిర్మాణ పురోగతి వివరాలు ఇందిరమ్మ ఇండ్ల యాప్ లో నమోదు చేయడం జరుగుతుందని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం నమూనాల నిర్మాణం కోసం మొదట డోర్నకల్ నియోజకవర్గంలోని ఎంపీడీవో కార్యాలయంలో శంకుస్థాపన చేయడం జరిగిందని,కూసుమంచి మండల తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో మరో నమూనా ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశామని అన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లో ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌస్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 580 ఇందిరమ్మ మోడల్ హౌస్ ఇండ్లు నిర్మిస్తామని అన్నారు. సంక్రాంతి నాటికి కూసుమంచి మండల కేంద్రంలోని మోడల్ హౌస్ నిర్మాణం పూర్తవుతుందని అన్నారు.మోడల్ హౌస్ ను పరిశీలించి తక్కువ ధరతో నాణ్యతతో ఇల్లు ఎలా కట్టాలో పేదలు పరిశీలించి వారి స్థలాలలో నిర్మించుకోవాలని మంత్రి సూచించారు. ఇంటిలో నివసించే ప్రజలే నిర్మాణం చేసుకునేలా ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, మూడు లక్షలకు పైగా ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల వివరాలు సేకరణ జరిగిందని, డిసెంబర్ చివరి వరకు ప్రతి దరఖాస్తుదారుని వివరాలు సేకరణ పూర్తవుతుందని అన్నారు.గతంలో దరఖాస్తు చేసుకొనని కుటుంబాలు ఉంటే ప్రజాపాలన సేవా కేంద్రాలలో దరఖాస్తు సమర్పించవచ్చని, గతంలో దరఖాస్తు చేసుకున్న వారు మరణిస్తే, ఆ కుటుంబ సభ్యులు దరఖాస్తు సమర్పించాలని మంత్రి తెలిపారు. వివిధ కారణాలు చూపి ప్రజలకు ఇండ్లు ఎగ్గొట్టే ఉద్దేశం ప్రజా ప్రభుత్వానికి లేదని, రాబోయే 4 సంవత్సరాలలో 20 లక్షల ఇండ్లు తగ్గకుండా నిర్మించాలని ఇందిరమ్మ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సామాగ్రి ఎటువంటి ఇబ్బంది రాకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. పేదవాడి చిరకాల కోరిక సొంతింటి కలను నెరవేర్చే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి,మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్లు సీతారాములు,హరినాథ బాబు,నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, మండల ప్రత్యేక అధికారిణి శ్రీలత, హౌజింగ్ ఇఇ శ్రీనివాసరావు, పీఆర్ ఈఈ వెంకట్ రెడ్డి, కూసుమంచి మండల ఇన్ చార్జ్ తహసీల్దార్ కరుణశ్రీ, ప్రజాప్రతినిధులు, అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్‌లో హిందువుల పరిస్థితి ఆందోళనకరం

న్యూఢిల్లీ డిసెంబర్ 13(నిఘా న్యూస్): బంగ్లాదేశ్‌లో మైనారిటీలు, హిందువులపై జరుగుతున్న దాడుల వ్యవహారంపై భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ లోక్‌సభలో ప్రసంగించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో రాజ్యాంగంపై చర్చ జరగాలన్నది కాంగ్రెస్ సభ్యుల ప్రధాన డిమాండ్. ఈమేరకు అధికార ఎన్‌డీఏ, విపక్షాల మధ్య ఒప్పందం కుదరడంతో నేడు లోక్‌సభలో రాజ్యాంగంపై చర్చలు జరగనున్నాయి. కాగా రాజ్యసభలో ప్రతిపక్షాలు పెద్దఎత్తున చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో ఛైర్మన్ ఎగువ సభను సోమవారానికి వాయిదా వేశారు. అయితే బంగ్లాదేశ్‌లోని పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని జైశంకర్ పేర్కొన్నారు. వీటిని నివారించడానికి ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం మైనారిటీలు, హిందువుల భద్రతకు తగిన చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. ఈవిషయంపై ఇటీవల భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ బంగ్లాదేశ్‌కు వెళ్లి అక్కడి నేతలతో చర్చలు జరిపారన్నారు. మరోవైపు పాకిస్థాన్, భారత్‌కు మధ్య సత్సంబంధాలు నెలకొనాలంటే ఆ దేశంలో ఉగ్రవాదం పూర్తిగా నశించిపోవాలని, అప్పుడే భారత్ పాక్‌తో చర్చలకు ముందడుగు వేస్తుందని పేర్కొన్నారు. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్‌హసీనా దేశం విడిచివెళ్లిన తర్వాత బంగ్లాలో హిందూ మైనార్టీలపై దాడులు తీవ్ర పరిస్థితులకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టుతో పరిస్థితి మరింత దిగజారింది. ఆయనకు న్యాయసాయం అందించడంపై కూడా ఆందోళనలు నెలకొన్నాయి. ఈనేపథ్యంలో బంగ్లాదేశ్ ఇద్దరు దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించింది. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు వారిద్దరూ ఢాకా నుంచి పని చేయాలని సూచించినట్లు సమాచారం. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగినట్లైంది. కాగా షేక్ హసీనా రాజీనామా అనంతరం ఆగస్టు 5 నుంచి అక్టోబరు 22 మధ్యకాలంలో మైనారిటీలపై 88 మతపరమైన హింసాత్మక ఘటనలు జరిగినట్లు ఇటీవల బంగ్లాదేశ్ ప్రభుత్వం ఓ నివేదికలో వెల్లడిరచింది. బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న ఉద్రిక్తతలపై వైట్‌హౌస్ స్పందిస్తూ బంగ్లాలోని పరిస్థితులను అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ నిశితంగా పరిశీలిస్తున్నారని పేర్కొంది. అక్కడి హిందువులు, మైనారిటీలకు భద్రత కల్పించాలని ఇప్పటికే ఆ దేశ నాయకులకు స్పష్టం చేశామని వైట్‌హౌస్ ప్రతినిధి జాన్ కిర్బీ వెల్లడిరచారు. పరిస్థితులు మెరుగుపరిచేందుకు తాత్కాలిక ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.

## అల్లు అరెస్టులో తన ప్రమేయం లేదు



న్యూఢిల్లీ డిసెంబర్ 13(నిఘా న్యూస్): టాలీవుడ్ నటుడు అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేసిన ఘటన సంచలనంగా మారింది. అరెస్ట్ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించిన ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లు అర్జున్ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. ఇందులో తన జోక్యం ఏమీ ఉండదని చట్టం ముందు అందరూ సమానులేనన్నారు. చట్టపరమైన ప్రక్రియ జరుగుతుందన్నారు. తొక్కిసలాటలో ఒకరు చనిపోయిన నేపథ్యంలో పోలీసులు చర్యలు తీసుకుంటున్నారనిమోహన్ బాబు విషయంలో కోర్టు ఉత్తర్వులు ఉన్నాయన్నారు. ఈ నెల 4న ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంధ్య థియేటర్‌లో పుష్ప-2 బెనిఫిట్ షో సందర్భంగా వచ్చారు. ఆ సమయంలోనే ఒక్కసారిగా తొక్కిసలాట జరిగింది. ఈ క్రమంలో రేవతి అనే మహిళ మృతి చెందింది.ఆమె కుమారుడు గాయాలకు గురయ్యాడు. ఘటనలో మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు అల్లు అర్జున్‌తో పాటు పలువురిపై కేసులు నమోదు చేశారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో ముగ్గురిని అరెస్టు చేశారు. అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారు. అల్లు అర్జున్‌పై బీఎన్ఎస్ 118 (1), బీఎన్ఎస్ 105, రెడ్‌విత్ 3/5 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. రేవతి మృతిపై అల్లు అర్జున్ దిగ్భ్రాంతి వ్యక్తం చేయడంతో పాటు ఆమె కుటుంబానికి రూ.25లక్షల సాయం ప్రకటించారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ క్రమంలో అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్టు చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్టు అనంతరం గాంధీ ఆసుపత్రిలో పరీక్షలు చేశారు. ఆ తర్వాత ఆయనను కోర్టులో హాజరుపరుచనున్నారు. మరో వైపు పుష్ప స్టార్ తరఫు న్యాయవా దులు హైకోర్టును ఆశ్రయించారు.



## చేసేదంతా చేసి... అధికారులను బలి చేసిన రేవంత్

### రైతులంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి గౌరవం లేదు : కేటీఆర్

హైదరాబాద్ డిసెంబర్ 13 (నిఘా న్యూస్): రైతులంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి గౌరవం లేదని, అందుకే దాడులు, అక్రమ అరెస్టు పనులన్నీ రహస్యంగా చేయించి, ఇప్పుడు కెమెరాల ముందు దొరికిపోగానే అధికారులను బలిపశులను చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. నీ నిజ స్వరూపం రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ తెలిసిపోయిందని తెలిపారు. భూమి ఇయ్యను అన్నందుకు గిరిజన రైతులను జైలు లో పెట్టడం ఓకేనట.. జైలులో వారిని చిత్రహింసలు పెట్టడం ఓకేనట.. వారి కుటుంబసభ్యులను అర్ధరాత్రి ఇండ్ల మీద దాడిచేసి భయపెట్టడం, బెదిరించడం ఓకేనట.. నెల రోజులుగా వారికీ చెయ్యని నేరానికి బెయిల్ కూడా రాకుండా అడ్డుపడటం ఓకేనట.. గుండె జబ్బుతో ఉన్న పేషెంటుకు బేడీలు వేయించటం కూడా ఓకేనట అని కేటీఆర్ విమర్శించారు. చేసే దరిద్రపు పనులన్నీ రహస్యంగా చేయించి, ఇప్పుడు కెమెరాల ముందు దొరికిపోగానే అధికారులను బలిపశులను చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. నీ నిజ స్వరూపం రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ తెలిసిపోయిందని తెలిపారు. ఇకన్నైనా క్షమాపణలు చెప్పి కేసులు రద్దు చేయాలని, రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లగచర్ల ఘటనలో రిమాండ్ అయిన హీర్యానాయక్‌కు కంది జైలులోనే బుధవారం మధ్యాహ్నం స్వల్పంగా గండెనొప్పి వచ్చింది. దీంతో జైలు వైద్యులు పరీక్షలు చేశారు. అక్కడే ఈసీజీ తీసి చికిత్స కోసం బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ వైద్యశాలకు తరలించారు. సంగారెడ్డి దవాఖానలో ఈసీజీ ఇతర పరీక్షలు చేసిన వైద్యులు మందులు రాసి పంపించారు. బుధవారం రాత్రి మరోమారు హీర్యానాయక్‌కు గండెనొప్పి రావటంతో తిరిగి సంగారెడ్డి దవాఖానకే తీసుకురాగా వైద్యులు చికిత్స చేసి పంపించారు. గురువారం ఉదయం హీర్యానాయక్ గండెనొప్పితో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. జైలు సిబ్బంది అతడిని అంబులెన్స్‌లో కాకుండా జైలు వాహనంలోనే చేతికి బేడీలు వేసి సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తీసుకొచ్చారు.

## పుష్ప అరెస్టు

మొదటి పేజీ తరువాయి...

వినిపించారు.'అల్లు అర్జున్ తన ప్రతి సినిమా విడుదల రోజున థియేటర్‌కు వెళ్తారు. థియేటర్ యాజమాన్యం, నిర్మాత పోలీసులకు సమాచారం ఇచ్చారు. అల్లు అర్జున్ రాత్రి 9.40కి సంధ్య థియేటర్‌కు వెళ్లి మొదటి అంతస్తులో కూర్చున్నారు. తొక్కిసలాటలో మరణించిన మహిళ కింద అంతస్తులో ఉన్నారని అల్లు అర్జున్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. మధ్యాహ్నం అడగ్గానే లంచ్ మోషన్‌కు అనుమతివ్వడం తప్పుడు సంకేతం ఇస్తుందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలిపారు. క్వాష్ పిటిషన్‌లో మధ్యంతర బెయిల్ ఇవ్వొచ్చా, లేదా అనే అంశంపై వాదించాలని ఈ సందర్భంగా హైకోర్టు పీపీకి సూచించింది. థియేటర్‌కు వెళ్లొద్దని అల్లు అర్జున్‌కు పోలీసులు ముందుగానే సమాచారం ఇచ్చారని పీపీ కోర్టుకు తెలిపారు. భారీగా జనం ఉంటారని తెలిసినప్పటికీ అల్లు అర్జున్ వెళ్లారని వివరించారు. మధ్యంతర బెయిల్ ఇవ్వాలని క్వాష్ పిటిషన్‌లో ఎక్కడా కోరలేదని పీపీ వాదనలు వినిపించారు. క్వాష్ పిటిషన్‌పై అత్యవసర విచారణ అవసరం లేదని, సోమవారం విచారించాలని కోరారు. పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికీ తగిన భద్రత ఇవ్వలేదని అల్లు అర్జున్ న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. పోలీసులు కూడా భద్రత కన్నా అల్లు అర్జున్‌ను చూసేందుకే ఎక్కువ ఉత్సాహం చూపారని తెలిపారు. అల్లు అర్జున్ భద్రత సిబ్బంది తోయడంతోనే తొక్కిసలాట జరిగినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు దారుడి భార్య మరణించింది. కుమారుడు వెంటిలేటర్‌పై ఉన్నాడని పీపీ కోర్టుకు వివరించారు. అందుకే అల్లు అర్జున్‌కు ఎలాంటి ఊరట ఇవ్వొద్దని పీపీ తన వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, 'ఎఫ్ఐఆర్‌ను పూర్తిగా కొట్టివేయాలని పిటిషన్ వేశాం. పిటిషన్‌పై విచారణ కొనసాగుతుండగానే అరెస్టు చేశారు. అందువల్ల ఈ పిటిషన్ ద్వారానే మధ్యంతర బెయిల్ ఇవ్వొచ్చని గతంలో సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నందున మధ్యంతర బెయిల్ ఇవ్వాలని అర్ణబ్ గోస్వామి, మహారాష్ట్ర ప్రభుత్వం కేసులో బాంబే కోర్టు ఇచ్చిన తీర్పును ఉదహరించడంతో వాటి ఆధారంగా హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జైలు సూపరింటెండెంట్ కు రూ.50వేల వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. కేసు దర్యాప్తును, సాక్షులను ప్రభావితం చేయవద్దని అల్లు అర్జున్‌ను ఆదేశించిన హైకోర్టు తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. రెగ్యులర్ బెయిల్ కోసం నాంపల్లి కోర్టును సంప్రదించాలని సూచించింది. అంతకుముందు తొక్కిసలాట ఘటనలో అరెస్టయిన అల్లు అర్జున్‌కి బిగ్‌షాక్ తగలింది. ఆయన్ను 14 రోజుల రిమాండ్‌కు తరలించాలని నాంపల్లి కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు జారీచేశారు. దీంతో అతడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. బన్నీ రావటం వల్లే తొక్కిసలాట ఘటన జరిగిందనీ, అందుకే ఆయన్ను అరెస్టుచేశామని పోలీసులు కోర్టుకు నివేదించారు. పోలీసుల వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తి అర్జునుకి రిమాండ్ విధించారు. అనంతరం చంచల్‌గూడ జైలుకు తరలించారు. చిక్కడపల్లి పోలీసులు శుక్రవారం ఆయన ఇంటి వద్ద అరెస్ట్ చేశారు. అరెస్టు చేయడానికి తన ఇంటికి వచ్చిన పోలీసులకు అల్లు అర్జున్ సహకరించి స్టేషన్‌కు వచ్చారు. ఇప్పటికే సంధ్య థియేటర్ యజమానితో పాటు అక్కడ సెక్యూరిటీ వారిని కూడా పోలీసులు అరెస్ట్‌చేశారు. వైద్య పరీక్షల కోసం అల్లు అర్జున్ ను ఉస్మానియా ఆసుపత్రికి తీసుకుకెళ్లారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో అరెస్టయిన అల్లు అర్జున్‌కు వైద్య పరీక్షలు ముగిశాయి. అనంతరం ఆయన్ను పోలీసులు నాంపల్లి క్రిమినల్ కోర్టులో హాజరు పరిచేందుకు తరలించారు. గాంధీ ఆస్పత్రిలో అల్లు అర్జున్‌కు బీపీ, షుగర్ పరీక్షలతో పాటు, కొవిడ్-19 టెస్ట్ కూడా చేసినట్లు ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ సునీల్ తెలిపారు. అన్ని పరీక్షల్లో ఆయనకు సాధారణ ఫలితాలు వచ్చాయని వెల్లడిరచారు. ఈసీజీ పరీక్షలు కూడా నిర్వహించామని, భద్రతా కారణాల రీత్యా ఆయనను సూపరింటెండెంట్ కార్యాలయంలో వైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం పోలీసులు ఆయన్ను నాంపల్లి క్రిమినల్ కోర్టుకు తరలించారు. వైద్య పరీక్షల సందర్భంగా గాంధీ ఆస్పత్రికి వచ్చిన అల్లు అర్జున్‌ను చూసేందుకు ఆయన అభిమానులు, రోగులకు సహాయంగా వచ్చిన వారి బంధువులు ఎగబడ్డారు.అనంతరం నాంపల్లి కోర్టుకు హాజరుపర్చారు. అల్లు అర్జున్‌పై పలు సెక్షన్లలో కేసు నమోదైంది. దీంతో ఆయన తరఫు న్యాయవాది హైకోర్టుని ఆశ్రయించారు. పుష్ప 2 ప్రీమియర్ షోలు ఈనెల 4న రాత్రి 9.30 గంటలకు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంధ్య థియేటర్ వద్దకు అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. సరిగ్గా అదే సమయంలో అల్లు అర్జున్ తన సతీమణి స్నేహతో కలిసి థియేటర్‌కు వచ్చారు. థియేటర్ యాజమాన్యం ముందస్తుగా ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోలేదు. ఎంట్రీ, ఎగ్జిట్‌లో ఎలాంటి సెక్యూరిటీ ఏర్పాట్లు చేయలేదు. కాగా, బన్నీ రాకతో అక్కడ ఒక్కసారిగా సంభవించిన తొక్కిసలాటలో రేవతి (36) అనే మహిళ అక్కడికక్కడే మరణించగా, ఆమె కుమారుడు శ్రీతేజ గాయపడి, ఇప్పటికీ చికిత్స పొందుతున్నారు. ఇదిలావుంటే థియేటర్ వద్ద సంభవించిన తొక్కిసలాటకు గానీ, రేవతి మృతికి గానీ అల్లు అర్జున్‌కు సంబంధం లేదనీ, మృతురాలి భర్త భాస్కర్ మీడియాకు వెల్లడించారు. తమ కేసును ఉపసంహరించుకుంటున్నట్లుగా ప్రకటించారు. అయితే, కేసు నమోదుచేసి అరెస్ట్ చేశామని హైదరాబాద్ సిపి సివి ఆనంద్ వెల్లడిరచారు. అయితే ఈ కేసులో సినీ నటుడు అల్లు అర్జున్ హైకోర్టును ఆశ్రయించారు. చిక్కడపల్లి పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టి వేయాలని కోరుతూ బన్ని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. శుక్రవారం ఆయన్ను అదుపులోకి తీసుకున్న కొద్దిసేపటికే అల్లు అర్జున్ తరఫు న్యాయవాది దీనిని అత్యవసర పిటిషన్‌గా విచారించాలని న్యాయస్థానాన్ని కోరారు. 'అత్యవసర పిటిషన్‌ను ఉదయం 10.30 గంటలకే మెన్షన్ చేయాలి కదా' అని ఈ సందర్భంగా కోర్టు ప్రశ్నించింది. బుధవారం పిటిషన్ ఫైల్ చేశామని, క్వాష్ పిటిషన్‌ను వేసినట్లు పోలీసుల దృష్టికి కూడా తీసుకెళ్లామని అల్లు అర్జున్ తరఫు న్యాయవాది నిరంజన్ రెడ్డి కోర్టు దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం ఈ పిటిషన్‌ను సోమవారం విచారిస్తామని చెప్పింది. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా లంచ్ మోషన్ పిటిషన్‌గా స్వీకరించాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరారు. బుధవారం పిటిషన్ దాఖలు చేసి, నెంబర్ అయినా కోర్టు సిబ్బంది బిజీగా ఉండడం వల్ల లిస్టులోకి రాకపోయి ఉండొచ్చని వివరించారు. మధ్యాహ్నం 1.30 గంటలకు లంచ్ మోషన్ పిటిషన్ విచారించాలనడం సరైనది కాదని ఈ సందర్భంగా ప్రభుత్వ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. సోమవారం వరకూ ఈ కేసులో ఎలాంటి చర్యలు తీసుకోకుండా పోలీసులను ఆదేశించాలని అల్లు అర్జున్ తరఫు న్యాయవాది నిరంజన్‌రెడ్డి కోర్టును కోరారు.

## యువత వ్యాపార రంగంపై దృష్టి సాధించాలి

### ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**కాప్రా, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** యువత స్వయం కృషితో ఎదిగి వ్యాపార రంగంలో రాణించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఏ ఎస్ రావు నగర్ డివిజన్ పరిధి కినారా గ్రాండ్ లో జరిగిన ఎల్మెడ్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆరవ వార్షికోత్సవ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బాబ్జీ రెడ్డి, మల్లారెడ్డి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, బైరి నవీన్ గౌడ్, మాజీ డివిజన్ అధ్యక్షులు కాసం మహిపాల్ రెడ్డి సంస్థ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 17 నుంచి ధనుర్మాస ఉత్సవాలు



**రామంతపూర్, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** రామంతాపూర్లోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 17వ తేది నుంచి తిరుప్పావై ధనుర్మాస మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫౌండర్ కోట్ల నరసింహారెడ్డి, ఆలయ కార్యనిర్వ హణాధికారి ఇ.ఎన్.విజయభారతి తెలిపారు. ఈనెల 17న ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా 17న ధనుర్మాస ప్రారంభం అవుతుందని, 20న సహస్ర కుంకుమార్చన, 24న మాస కల్యాణం, 25న తులసి అలంకారం, 31న గోమాత పూజ, జనవరి 2వ తేదిన ఊంజల్సేవ, జనవరి 6 తేదిన ఆభరణో త్సవం, 8న దీపోత్సవం, 10న వైకుంఠ ఏకాదశి, ఉత్తర ద్వార దర్శనం, 11న కుడారై ఉత్సవం, 13న గోదారంగనాధస్వామి కళ్యాణం జరుగుతుందని తెలిపారు.

## నిజాంపేట్ లో మహా పడిపూజ




**నిజాంపేట్, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ లో అయ్యప్ప నామ సర్మనతో అంగరంగ వైభవంగా మహా పడిపూజ నరసింహారావు గురుస్వామి ఆధ్వర్యంలో 18 మెట్ల మహా పడిపూజ కనుల పండుగ జరుపుకున్నారు అనంతరం అయ్యప్ప మహా పడిపూజలో మొదటగా గణపతి పూజ కలశ పూజ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పూజ అయ్యప్ప స్వామి ఊరేగింపు అయ్యప్ప అలంకరణ అయ్యప్ప స్వామి పూజ అయ్యప్ప స్వాములు శరణు ఘోష నినాదాలతో హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామి కనుల పండుగగా జరుపుకున్నారు.

## రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలకు రామప్ప విద్యార్థులు




**హనుమకొండ, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** నాలుగవ తెలంగాణ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బేస్ బాల్ ఛాంపియన్ షిప్ ఫర్ మెన్ ఈ నెల మహబూబాబాద్, ఎన్టీఆర్ స్టేడియం లో జరగబోయే 4వ తెలంగాణ అంతర్జిల్లా బేస్ బాల్ ఛాంపియన్ షిప్ హన్మకొండ, భూపాలపల్లి జిల్లా జట్టుకు దినేష్, జ్ఞానేశ్వర్, సాయిచరణ్, రాకేష్, విక్రమ్, సామ్యూల్, సృజన్, అధిత్,గణేష్,ఈ నెల 13వ తేదీ నుండి 15వ తేదీ వరకు జరిగే సీనియర్ ఇంటర్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని కళాశాల డైరెక్టర్ కరుణాకర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ కోచ్ కమల్, వైస్ ప్రిన్సిపాల్ తిరుపతి, ఎవో సతీష్, జోనల్ మేనేజర్ పూర్ణ చందర్ గౌడ్ అధ్యాపక బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ కరుణాకర్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక అవడం గర్వంగా ఉందని, ఇంటర్ విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్న ఏకైక కళాశాల అని అన్నారు.

## తూప్రాన్ లో మహా పడిపూజ



**తూప్రాన్, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** తూప్రాన్ మండలంలోని ఘనపూర్ ఎంజి ఫంక్షన్ హాల్ లో అయ్యప్ప పూజలను ఘనంగా జరిపించారు. ముఖ్యంగా గురుస్వామి అల్లాడి నాగరాజు 18వ మహా పడిపూజ కార్యక్రమాన్ని గురుస్వాములు అందరూ కలిసి జరిపించడం జరిగింది. ముఖ్య అతిథిగా మనోహరాబాద్ మాజీ సర్పంచ్ చిటుకుల మహిపాల్ రెడ్డి హాజరై అయ్యప్ప స్వామి తీర్థ ప్రసాదాలను స్వీకరించి ఆశీస్సులను పొందారు. ఈ మహాపాడి పూజలో గురుస్వాములు, కన్నె స్వాములు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఖాళీగా ఉన్న డబుల్ ఇండ్లను స్థానికులకు కేటాయించండి

- బల్దియా పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపరచండి
- బల్దియా కమిషనర్ కు ఎమ్మెల్యే జిఎంఆర్ వినతి




**పటాన్ చెరు, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** పటాన్చెరు నియోజకవర్గ పరిధిలో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లలో లబ్ధిదారులకు కేటాయించని ఇళ్లను స్థానికులకు కేటాయించాలని, మూడు డివిజన్ల పరిధిలో పారిశుద్ధ వ్యవస్థ మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తికి స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. శుక్రవారం హైదరాబాద్ లోని బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ తో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా పారిశ్రామికవాడగా పేరొందిన పటాన్చెరు పరిధిలో నిరుపేదలు అత్యధికంగా నివసిస్తున్నారని, సొంత ఇల్లు లేక కిరాయిలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలలో నిర్మించిన 40 వేల డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో ఖాళీగా ఉన్న ఇళ్లను స్థానికులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో కొద్దిమంది లబ్ధిదారులకు మాత్రమే ఇళ్లను కేటాయించడం జరిగిందని, అర్హత కలిగిన లబ్ధిదారులు వేల సంఖ్యలో ఉన్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. భారతి నగర్, రామచంద్రాపురం, పటాన్చెరు డివిజన్ల పరిధిలో పారిశుద్ధ్య కార్మికుల కొరత మూలంగా శానిటేషన్ పూర్తి స్థాయిలో జరగడం లేదని తెలిపారు. చనిపోయిన కార్మికుల స్థానాల్లో నూతన కార్మికులను నియమించాలని, అర్హత లేకున్నా సూపర్వైజర్లు గా వ్యవహరిస్తున్న కార్మికులపై చర్యలు తీసుకోవాలని, సర్కిల్ పరిధిలో నూతన జెసిబిని ఏర్పాటు చేయాలని కోరారు. పేద ప్రజల అవసరాల కోసం నిర్మించిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ అధ్వానంగా తయారయిందని తెలిపారు. రహదారులపై నిర్మించిన టాయిలెట్ల నిర్వహణ గాలికి వదిలేసారని పేర్కొన్నారు. వీటన్నింటిపై క్షేత్రస్థాయిలో పర్యటించి తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

# 1100 కోట్ల వ్యయంతో.. ఏడు సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు

### నూతన పాంట్ల ఏర్పాటుతో చెరువులకు మహర్దశ: జిఎంఆర్



**పటాన్ చెరు, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమృత్ 2.0 పథకంలో భాగంగా పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ఏడు చెరువుల పరిధిలో 1100 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఏడు సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయబోతున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పటాన్చెరువు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జలమండలి ఎస్టిపి విభాగం అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన ఎస్టిపి ప్లాంట్ల ఏర్పాట్లపై సమగ్ర నివేదికను ఎమ్మెల్యేకు అందించారు. నియోజకవర్గ పరిధిలోని తిమ్మక్క చెరువు, మేళ్ల చెరువు, ఉసికే బావి, ఇక్రిసాట్, గండిగూడెం, బచ్చు గూడెం, అమీన్పూర్ పరిధిలోని చెరువుల సమీపంలో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల ఏర్పాటుకు 1100 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. ఎందుకు అనుగుణంగా ప్లాంట్ల ఏర్పాటుకు భూ కేటాయింపులు జరపాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్, స్థానిక రెవెన్యూ అధికారులకు సంబంధిత శాఖ అధికారులు పంపించడం జరిగిందని పేర్కొన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన అనంతరం ప్లాంట్ల పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 25 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 35 శాతం, 40 శాతం సంభందిత కాంట్రాక్టర్ కు బి ఓ టి పద్ధతిలో నిధులు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా చెరువులు, కాలువలను మురికి నీరు, కాలుష్యం బారి నుండి సంరక్షించుకోవడంలో ప్లాంట్ల ఏర్పాటు కీలక పాత్ర పోషించనుందని తెలిపారు. అతి త్వరలో భూ కేటాయింపులు జరిపేందుకు కృషి చేయనునట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవుజా, జలమండలి డిజిఎంలు బాబు, దీపాలి శ్రీనివాసరావు తహసిల్దార్లు రంగారావు, రాధా సంగ్రామ్, బిక్షపతి గంగా భవాని తదితరులు పాల్గొన్నారు.

# అభిరుచికి తగ్గ కోర్సులను ఎంచుకోండి

### అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్ విద్యార్థులకు గీతం ప్రొఫెసర్ డీఎస్.రావు సూచన



**పటాన్ చెరు, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** అభిరుచికి తగ్గ కోర్సులను ఎంపిక చేసుకుని, అందులో రాణించి, భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్ విద్యార్థులకు గీతం హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు సూచించారు. అవినాష్ కళాశాల కూకట్ పల్లి, ఎల్.బీ.నగర్, హయత్ నగర్, సికింద్రాబాద్ శాఖలకు చెందిన దాదాపు 750 మంది విద్యార్థుల బృందం శుక్రవారం గీతం హైదరాబాద్ ప్రాంగణాన్ని సందర్శించింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో గీతం ప్రోవీసీ అవినాష్ విద్యార్థులను స్వాగతించి, ఈ ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థకు చెందిన అన్ని అంశాలను స్వయంగా పరిశీలించి కూలంకషంగా తెలుసుకోవాలని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఇన్ ఛార్జి డైరెక్టర్ డాక్టర్ దివ్య కీర్తి గుప్తా బీ-స్కూల్ గురించి లోతైన అవగాహన కల్పించడమే గాక, అక్కడున్న బ్లూమ్ బెర్గ్ వంటి అత్యాధునిక మౌలిక సదుపాయాల గురించి వివరించారు. అవినాష్ విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆమె ఆకట్టుకునే జవాబులిచ్చి వారిని ఉత్సాహపరిచారు. గీతం బీ-స్కూల్ ఎంబీఏ చివరి సంవత్సరం విద్యార్థులతో అవినాష్ బృందం ముఖాముఖి సమావేశమై, వివిధ కెరీర్ ఎంపికలు, భవిష్యత్తు అవకాశాల గురించి ప్రత్యక్ష జ్ఞానాన్ని అందించారు. ఆ తరువాత, కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కె.మమత వారితో సమావేశమై, ప్రాంగణ నియామకాలు, దానికి సన్నాహకంగా గీతంలో ఇచ్చే శిక్షణ, దానిని విజయవంతంగా పూర్తి చేసుకుని వివిధ కంపెనీలకు ఎంపికైన వారు పొందుతున్న జీతభత్యాల వివరాలను తెలిపారు.

# ఆచార వ్యవహారాలలో శాస్త్రీయత

### ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి



**కర్నూలు/శిరివెళ్ళ, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** మన పూర్వీకులు ఏర్పాటు చేసిన ఆచార వ్యవహారాలను కాపాడుకోవాలని, అందులో ఆరోగ్య సూత్రాలున్నాయని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా, శిరివెళ్ళ మండలం, వెంకటాపురం గ్రామంలో వెలసిన శివాలయం నందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం కుంకుమార్చన కార్యక్రమంతో ముగిశాయి. మూడు రోజులపాటు శ్రీమద్రామాయణం మహాభారతం భగవద్గీతలపై ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాస్ చేసిన ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలి చేసిన భజనలు భక్తులను ఎంతగానో అలరించాయి. స్థానిక అర్చకులు పలుకూరు కిరణ్ కుమార్ శర్మ భక్తులందరిచే సశాస్త్రీయంగా కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహింప చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు గాదె ఎలిగొండా రెడ్డి, స్థానిక సర్పంచ్ కందుల మల్లీశ్వరి, వెంకటలక్ష్మి, రాజేశ్వరి, నర్సమ్మ, సరస్వతమ్మతో పాటు స్థానిక భక్త సమాజం పాల్గొన్నారు.

# గ్రూప్ 2 పరీక్ష ఏర్పాట్లను పర్యవేక్షించిన ఆర్డీవో




**తూప్రాన్, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** తూప్రాన్ రెవెన్యూ డివిజనల్ అధికారి జయచంద్ర రెడ్డి తూప్రాన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గ్రూప్ 2 పరీక్షల నిర్వకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పరీక్షా నిర్వహణ నియమాల వివరణ, నిరీక్షకుల బాధ్యతలు, పూర్తి మార్గదర్శనం, పరీక్షా నిష్పాక్షికతను నిలబెట్టు కోవడం, సాంకేతిక ప్రక్రియాగత సూచనలు, నైతిక వృత్తి పరమైన నడవడి నిబంధనలను ఆర్డీవో అధికారులకు వివరించారు. ఆది, సోమవారం రోజులలో ప్రభుత్వ జూనియర్ కళాశాల శ్రీ చైతన్య స్కూల్ లలో ఒక్కొక్క కేంద్రంలో 288 అభ్యర్థుల చొప్పున ఈ పరీక్షకు హాజరు కాబోతున్నారని ఆయన తెలిపారు. ఇందు కోసం బిఎన్ఎస్ఎస్ లోని 163 సెక్షన్ ద్వారా నిర్దేశాజ్ఞలను జారీ చేయబడినవని, పరీక్షా సమయాల్లో పై పరీక్షా కేంద్రాల పరిసరాల్లో నలుగురు కంటే ఎక్కువ వ్యక్తులు ఒకే చోట గుమి కూడదని, ర్యాలీలు నిర్వహించకూడదని, పరీక్షా కేంద్రాల నుండి 100 మీటర్ల పరిధిలోని అన్ని జిరాక్స్ సెంటర్లు దుకాణాలను మూసివేయల్సిందిగా తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి వెల్లడించారు.



మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఇందిరా నెహ్రూ నగర్ కి చెందిన మల్లేష్ కు 60 వేలు అదే బస్తీకి చెందిన వీరస్వామికి 42 వేల చెక్కుని అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో వెంకటేశ్ యాదవ్, బి.కే.శ్రీనివాస్, కన్నెమల్ల నాగరాజ్,సిరిగిరీ రాజు, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

*-మల్కాజిగిరి, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):*

## కొండా విజయ్ కు క్రీడాకారుల అభినందనలు



**శేరిలింగంపల్లి, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా నియామకం అయిన కొండ విజయ్ కుమార్ ని చందానగర్ పీజేఆర్ స్టేడియం కు చెందిన వివిధ క్రీడా కోచ్, క్రీడాకారులు శుక్రవారం అభినందించారు. పీజేఆర్ స్టేడియం లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కొండా విజయ్ ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. చందానగర్ కు చెందిన కొండ విజయ్ కు ఒలింపిక్ అసోసియేషన్ లో అవకాశం రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధి కోసం పాటుపడాలని వారు కొండ విజయ్ ను.కోరారు. ఈ కార్యక్రమంలో క్రీడా శిక్షకులు లక్ష్మణ్, మహేష్, నవీన్, శ్రీకాంత్, వెంకటేష్, ప్రభాకర్ లతో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

## కాట శ్రీనివాస్ గౌడ్ పుట్టినరోజు వేడుకలు



**పటాన్ చెరు, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** పట్టణంలోని ఐదు మండలాలు మున్సిపాలిటీలకు సంబంధించిన కాంగ్రెస్ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో కాటా శ్రీనివాస్ గౌడ్ బర్త్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పటాన్ చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. అనంతరం కార్యకర్తలు బ్లడ్ డొనేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పటాన్చెరువు మండల అధ్యక్షుడు సుధాకర్ గౌడ్, కౌన్సిలర్ శశిధర్ రెడ్డి మున్నా, శ్రీకాంత్ రెడ్డి, సుధాకర్ గౌడ్, చంద్రారెడ్డి, మహేష్ గౌడ్, నర్సింగరావు, శోభ,జయమ్మ, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుంది

### ఈస్ట్జోన్ డిప్యూటి కమీషనర్ డా.బి.బాలస్వామి



**హైదరాబాద్, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** క్రీడలతో క్రమశిక్షణ, మానసిక ఉల్లాసం అలవడుతుందని ఈస్ట్జోన్ డిప్యూటి కమీషనర్ డా.బి.బాలస్వామి ఐపిఎస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆక్స్ఫర్డ్ గ్రామర్ హైస్కూల్లో 44వ వార్షిక క్రీడా దినోత్సవం వేడుకల ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలను జీవిత మార్గంగా స్వీకరించాలని పిలుపు నిచ్చారు. యువ క్రీడాకారులను తీర్చిదిద్దడంలో పాఠశాల చేస్తున్న కృషి గొప్పదని అన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన రంజీ ట్రోఫీ ఆటగాడు సాకేత్ సాయి రామ్ పాఠశాల క్రికెట్ జట్లను అభినందించారు. ఈ సందర్భంగా 7, 8 తరగతుల విద్యార్థులు 'జై హెూ' పాట ప్రదర్శన ఉత్సాహాన్ని నింపింది. వేడుకలకు హాజరై విద్యార్థులను ప్రోత్సహించిన అతిథులకు పాఠశాల డైరెక్టర్ ప్రార్థన ధన్యవాదాలు తెలిపారు. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి వెంకట్ రావును సత్కరించారు.

## పారిశుద్ధ్య సిబ్బందికి సన్మానం



**పహాడీ షరీఫ్, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** జల్పల్లి మున్సి పాలిటీ పరిధి శ్రీరామ్ కాల నీలో ఉన్న కృష్ణ డి దేవాలయం దగ్గర శానిటేషన్ సిబ్బందికి, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీను, సూపర్వైజర్ కుమార్ ను కమిటీ సభ్యులు సన్మానించారు. అఖండ హరినాథ్ సప్తం కార్యక్రమంలో భాగంగా గత వారం నుంచి పూజా కార్యక్రమాలు దేవాలయం దగ్గర జరుగుతున్నాయి. ఇక్కడ శానిటేషన్ సిబ్బంది గుడి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినందుకు కమిటీ సభ్యులు నాగరాజ్, నర్సింగ్ రావు, అశోక్ రావులు సన్మానించారు.

## ముంపు ప్రాంతాల్లో పర్యటించిన జనసేన ఇంచార్జ్



శ్రీకాళహస్తి, డిసెంబర్ 13 (నిఘా న్యూస్): శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎడతెరపి లేని వర్షాల కారణంగా పలు గ్రామాల్లో నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి వినుత కోటా పలు గ్రామాలు సందర్శించారు. ఏర్పేడు మండలం, పాగలి పంచాయతీ, కుమ్మరిగుంట గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని మండల ఎంపీడీవోతో ఫోన్లో మాట్లాడి తక్షణమే వీధుల్లో నీరు తొలగించేలా చర్యలు చేపట్టాలని, స్ట్రీట్ లైట్లు వెయ్యాలని, దెబ్బతిన్న ఇళ్లకి పరిహారం ఇవ్వాలని తెలిపారు. రెండు రోజులు వర్షాల కారణంగా రోజువారీ కూలికి వెళితేనే పూట గడవని గ్రామ ప్రజలకి అన్నం ప్యాకెట్లు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

## రావిరాలలో ఘనంగా అయ్యప్ప పడిపూజ



తుక్కుగూడ, డిసెంబర్ 13 (నిఘా న్యూస్): తుక్కుగూడ మున్సిపాలిటీ రావిరాల గ్రామంలో మీగడ మురళి, శ్రీ శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి పదునెట్టాంబడి మహా పడిపూజ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తుక్కుగూడ మున్సిపాలిటీ చైర్ పర్సన్ బరిగెల హేమలత రాజు గౌడ్, మాజీ చైర్మన్ కాంటేకార్ మధుమోహన్, కౌన్సిలర్లు రాజమోని రాజు ముదిరాజ్, బోద యాదగిరెడ్డి, తదితరులు అయ్యప్ప ఆశీస్సులు తీసుకున్నారు.

## ఈనెల 16న.. నగరానికి పద్మభూషణ్ 'శ్రీ ఎం' రాక

### సత్సంగ్ ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవ



హైదరాబాద్, డిసెంబర్ 13 (నిఘా న్యూస్): ప్రముఖ ఆధ్యాత్మిక మార్గదర్శి రచయిత, సత్సంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పద్మభూషణ్ శ్రీ ఎం(ముంతాజ్ అలీ ఖాన్) నగరానికి రానున్నారు. బషీర్ బాగ్ లోని భారతీయ విద్యాభవన్ లో ఈనెల 16న పబ్లిక్ టాక్-ముక్తి అర్థం, 20న వాకింగ్ విత్ ఎం డాక్యుమెంటరీ ఫిల్మ్ ప్రీమియర్ ప్రదర్శన, ఈ రెండు కార్యక్రమాలకు హాజరు కానున్నట్లు నిర్వాహకులు శుక్రవారం నగరంలో విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ శ్రీ ఎం తన ఫౌండేషన్ ద్వారా విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, పర్యావరణం, మానవాళికి సేవ లాంటి రంగాలలో విశేష సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, ఆధ్యాత్మికవేత్తలు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## మొక్కలు నాటడం సామాజిక బాధ్యత



గడ్డి అన్నారం, డిసెంబర్ 13 (నిఘా న్యూస్): అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గడ్డి అన్నారం డివిజన్ పరిధిలో శ్రీ చైతన్య హై స్కూల్ లో కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మాట్లాడుతూ స్వచ్ఛదనం పచ్చదనం అందరి సామాజిక బాధ్యత అన్నారు. మొక్కలు నాటడం వలన కాలుష్య నియంత్రణ తగ్గడంతో పాటు అందరు సుఖ సంతోషాలతో జీవిస్తారని తెలిపారు.

## నంద్యాలలో కేంద్రీయ విద్యాలయం కోసం కృషి

### ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



నంద్యాల, డిసెంబర్ 13 (నిఘా న్యూస్): నంద్యాల జిల్లా కేంద్రంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కృషి చేస్తున్నామని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి శుక్రవారం తెలిపారు. నంద్యాల జిల్లా కేంద్రంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు పరిశీలిస్తున్నామని కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ తెలిపిందని ఎంపీ శబరి చెప్పారు. నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి ఆంధ్రప్రదేశ్ లోని జిల్లా కేంద్రం నంద్యాలలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వంకు విన్నవించారని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా జిల్లా కేంద్రం నంద్యాల పట్టణంలో కొత్తగా కేంద్రీయ విద్యాలయం ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వంకు ప్రతిపాదన పంపిందని, ఈ రెండు ప్రతిపాదనల అవసరమైన ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉందని కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ తమకు సమాచారం ఇచ్చినట్లు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



పటాన్ చెరు, డిసెంబర్ 13 (నిఘా న్యూస్): పేదల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని జిన్నారం, గుమ్మడిదల, పటాన్చెరు, రామచంద్రాపురం రెవెన్యూ మండలాల పరిధిలోని వివిధ గ్రామాలు, వార్డులు, డివిజన్లకు సంబంధించిన 208 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన రెండు కోట్ల ఎనిమిది లక్షల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే జిఎంఆర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ఆడపిల్ల పెళ్లి భారం కాకూడదన్న సమున్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. అతి త్వరలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కాబోతోందని తెలిపారు. పూర్తి పారదర్శకతతో పథకం కొనసాగుతుందని తెలిపారు. ఇళ్ల విషయంలో దళారులను ఆశ్రయించవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నగేష్, తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, కౌన్సిలర్లు, ఆయా మండలాల తహసిల్దార్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సోమిరెడ్డి, పరమేశ్ యాదవ్, లబ్దిదారులు పాల్గొన్నారు.

# నెట్ జీరో లక్ష్య సాధనకు.. ప్యాకేజింగ్ రంగమే కీలకం

### పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డా.జయేష్ రంజన్



హైదరాబాద్, డిసెంబర్ 13 (నిఘా న్యూస్): నెట్ జీరో లక్ష్య సాధనకు ప్యాకేజింగ్ రంగమే కీలకం అని తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ, ఈసీ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ జయేష్ రంజన్ అన్నారు. ప్యాకేజింగ్ రంగం భవిష్యత్తు ఎలా ఉండబోతోందన్న అంశంపై లోతుగా చర్చించేందుకు సీఐఐ తెలంగాణ ఆధ్వర్యంలో సీఐఐ తెలంగాణ ప్యాకాన్-24 నాలుగో ఎడిషన్ సదస్సు ఈనెల 12, 13 తేదీల్లో విజయవంతంగా నిర్వహించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సుకు జయేష్ రంజన్ ముఖ్య అతిథిగా హాజరై సీఐఐ తెలంగాణ ప్యాకాన్-24 ఛైర్మన్ ఏవీపీఎస్ చక్రవర్తి, వైస్ చైర్మన్ రాచమల్లు, సీఐఐ ఎస్ఆర్ మాజీ ఛైర్మన్ అనిల్ ఏపూర్, ఫోర్జింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ ఆర్ఎస్.రెడ్డిలతో కలిసి ప్రసంగించినట్లు తెలిపారు. 'ఇన్నోవేటింగ్ టుడే ఫర్ టుమారోస్ గ్లోబల్ మార్కెట్ ఛాలెంజెస్-ప్యాకేజింగ్, బియాండ్' అనే థీమ్‌తో జరిగిన ఈ సదస్సు ప్రధానంగా నెట్ వర్కింగ్, నాలెడ్జ్ షేరింగ్, వినూత్న ప్యాకేజింగ్ టెక్నాలజీలు, వ్యూహాలను హైలైట్ చేయడానికి ఒక వేదికను అందించిందన్నారు.

# పేదలకు కార్పొరేట్ విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నతులుగా ఎదగాలి

### ఘట్కేసర్ మున్సిపల్ చైర్మన్ పావని యాదవ్



ఘట్ కేసర్, డిసెంబర్ 13 (నిఘా న్యూస్): ప్రతి విద్యార్థి విద్యపై ఏకాగ్రతను పెంచుకుని ఉన్నత స్థాయికి ఎదిగేలా నిరంతరం శ్రమించాలని ఘట్ కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని యాదవ్ తెలిపారు. ఘట్ కేసర్ మున్సిపాలిటీ ఎదులాబాద్ లోని తెలంగాణ సాంఘిక, సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ బి.వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన వాయిస్ ఫర్ బాయ్స్ కార్యక్రమంలో చైర్ పర్సన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పేద విద్యార్థులందరికి కార్పోరేట్ విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన గురుకుల పాఠశాలల ద్వార అనేక మంది విద్యార్థులకు ఉన్నతమైన విద్యా బోధన అందుతున్నట్లు చెప్పారు. క్రమశిక్షణ పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకున్నప్పుడే సార్ధకత ఉంటుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఎస్ కే ఎం భాషా, ఉపాధ్యాయ బృందం, వాయిస్ ఫర్ బాయ్స్ కార్యక్రమ ఇంచార్జి లోహిత్, స్థానిక నాయకులు నాగరాజు, అమరేందర్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు

### దాతలు సహకరించాలని పిలుపు

### ముస్తాబాద్ ఎస్సై సిహెచ్ గణేష్




ముస్తాబాద్, డిసెంబర్ 13 (నిఘా న్యూస్): రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎస్సై సిహెచ్ గణేష్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆయా గ్రామాలకు సంబంధించిన దాతలు సహకరించాలని కోరారు. గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలలో రాత్రి వేళలలో కొంతమంది యువకులు మద్యం సేవిస్తూ, పాఠశాల ఆవరణలోని వస్తువులను ధ్వంసం చేయడం వంటి ఆ సాంఘిక చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల ఎన్నో నేరాలు కట్టడి చేయవచ్చని ఎస్సై గణేష్ తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపితే కేసులు నంబరు లేని వాహనాలు నడపవద్దని తప్పకుండా ప్రతి వాహనానికి నంబర్ ప్లేట్ కలిగి ఉండాలని, లేదంటే సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. త్రిబుల్ రైడింగ్ చేసినా, లైసెన్సులు లేకున్నా కేసులు నమోదు అవుతాయని తెలియజేశారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండే విధంగా వారి తల్లిదండ్రులు గమనిస్తూ చర్యలు తీసుకోవాలన్నారు. అధిక వడ్డీ వేధింపులపై కఠిన చర్యలు నిరుపేద ప్రజల అవసరాలను ఆసరా చేసుకొని వారికి అప్పులు ఇస్తూ అధిక వడ్డీల వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మన మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలని అందుకు మండల ప్రజలందరి సహకారం ఉండాలని కోరారు.

# గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ వద్ద సీసీ కెమెరా మైక్



కాప్రా, డిసెంబర్ 13 (నిఘా న్యూస్): స్వచ్ఛతపై ఒక అడుగు ముందుకు వేయడానికి జీహెచ్ఎంసి అధికారులు నూతన ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా కాప్రా సర్కిల్ డిసి ఆదేశాల మేరకు సాకెత్ ఏరియాలో ఉన్న గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ వద్ద సీసీ కెమెరా, మైక్ బిగించారు. దీంతో ట్రాన్స్ఫర్ స్టేషన్ నుండి జరిగే స్వచ్ఛ ఆటోల డంపింగ్ విధానం, రామ్ కి వాహనాల ద్వారా జరిగే లోడింగ్ అన్ లోడింగ్ ప్రక్రియను పరిశీలించుటకు ఈ కెమెరా ఉపయోగపడుతదని పేర్కొంటున్నారు. స్వచ్ఛ ఆటో వారు ఏ సమయానికి లోడింగ్ వాహనాలతో వస్తున్నారు. ఏ సమయానికి వారి వాహనం అన్లోడ్ అవుతుంది. స్వచ్ఛ ఆటో వారు ట్రాన్స్ఫర్ స్టేషన్లో ప్రతి ట్రిప్ కు ఎంతసేపు వేచి ఉండవలసి వస్తుంది. రోజు ప్రతి స్వచ్ఛ ఆటో ఎన్ని ట్రిప్పులు ఇంటి నుండి కమర్షియల్ ఎస్టాబ్లిష్మెంట్స్ నుండి గార్బేజ్ కలెక్ట్ చేసి ట్రాన్స్ఫర్ స్టేషన్ కి తెస్తున్నారనేది తెలుస్తది అంటున్నారు. కాలనీలో వీధుల్లో చెత్త సేకరణ అనంతరం ట్రాన్స్ఫర్ స్టేషన్ కి వచ్చే క్రమంలో చెత్త రోడ్లపై పడకుండా టార్పలిన్ కవర్ కప్పుకొని వస్తున్నారా లేదా అనేది తెలుస్తది. స్వచ్ఛ ఆటోలు ఎక్కువగా టార్పల్లి కవర్ ఆటోకు కప్పి తీసుకురావడం లేదు. దాంతో చెత్త గాలికి ఎగిరి రోడ్ల పైన వెళ్లే వాహనదారులకు పాదచారులకు ప్రమాదాలు జరిగిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఆటోల పైన ఎవరైనా 14 సంవత్సరాల లోపు బాల కార్మికులు పనిచేస్తున్నారా అన్లోడింగ్ కు వచ్చిన ఆటోలు తెలుసుకోవడానికి అన్లోడ్ చేయడానికి రామ్ కి సంస్థ ఏర్పాటు చేసే కంటైనర్స్ సంఖ్య సరిపోవట్లేదని అందువల్ల ట్రాన్స్ఫర్ స్టేషన్లో అన్లోడ్ కావడానికి సమయం ఎక్కువ తీసుకుంటున్న పరిస్థితి ఉంది. దీని కారణంగా చాలామంది ఆటో వారు ఒక్క ట్రిప్ తోనే సరిపెట్టుకొని రెండవ ట్రిప్ కు మూడవ ట్రిప్ కు గార్బేజ్ తీసుకురాలేక పోతున్నామని స్వచ్ఛ ఆటోల నుండి ఆరోపణలు వస్తున్నాయి. అందువలన వారికి ఎక్కువ డబ్బులు వచ్చే కమర్షియల్ ఎస్టాబ్లిష్మెంట్ నుండి చెత్తను కలెక్ట్ చేసి ఇంటింటి చెత్తను చాలా వరకు తీయకుండా వదిలేస్తున్నారు. దీంతో ప్రజలు రోడ్లపై ఖాళీ స్థలాల్లో మోరీల్లో ట్రాన్స్ఫార్మర్ల వద్ద చెత్త వేయడానికి ముఖ్య కారణం అవుతుంది. స్వచ్ఛ ఆటో వారు ఇంటింటి చెత్త సేకరణలో భాగంగా దగ్గరలో ఉన్న ఇండస్ట్రియల్ ఏరియా నుండి చెత్తను సేకరించి ఇక్కడ వేస్తున్నారని వచ్చే ఆరోపణలు కూడ ఉన్నాయి. ఈ కెమెరాలతో చెక్ పెట్టవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. రాంకీ సంస్థ వారు ట్రాన్స్ఫర్ స్టేషన్ కి వచ్చే గార్బేజ్ కి సరిపడా కంటైనర్స్ ఏర్పాటు చేయుటకు అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిపడా కంటైనర్స్ ఏర్పాటు చేయించుటకు అవకాశం ఉంటది అంటున్నారు. గతంలో అనార్గనైజ్డ్ గా ట్రాన్స్ఫర్ స్టేషన్ మెయింటైన్ చేయడం వలన చుట్టుపక్కన గల 15 కాలనీలు చాలా ఇబ్బందులకు గురై ఇక్కడ ట్రాన్స్ఫర్ స్టేషన్ నిర్వహించుటకు అభ్యంతరం వ్యక్తం చేసి ధర్నాలు నిర్వహించిన సందర్భాలు ఉన్నాయి. ఈ సీసీ కెమెరా మానిటరింగ్ వలన అలాంటి సమస్యను కూడా అధిగమించవచ్చని అభిప్రాయ పడుతున్నామని జీహెచ్ఎంసి అధికారులు పేర్కొంటున్నారు. సీసీ కెమెరా మైక్ ఏర్పాటు చేయడానికి అనుకూలంగా పరిస్థితులు ఉన్నటువంటి ఏ ట్రాన్స్ఫర్ స్టేషన్ కైనా ఉపయోగ పడుతుందని ఈ ప్రయోగం తప్పనిసరిగా మంచి ఫలితాన్నిస్తుందని కాప్రా సర్కిల్ సానిటరీ సూపర్వైజర్ తెలియజేశారు. ఈ సందర్భంగా సీసీ కెమెరా మైక్ ను డొనేట్ చేసిన స్వచ్ఛ ఆటో డ్రైవర్లు పెద్ద నరసింహ, చిన్న నరసింహులు సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రాంకీ సంస్థ నుండి ఎల్బినగర్ జోనల్ వెహికల్ ఇంచార్జ్ సూపర్వైజర్ అమానుల్లా ఖాన్, సాకేత్ ట్రాన్స్ఫర్ స్టేషన్ వెహికల్స్ మానిటరింగ్ సూపర్వైజర్ చందు, సుబ్రహ్మణ్యం, పోచయ్య పాల్గొన్నారు.





శ్రీకాళహస్తి పట్టణంలో వైయస్సార్ సర్కిల్ వద్ద వడ్లతాంగల్ చెంగల్రాయ రెడ్డి ఐదవ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం మాజీ అధ్యక్షులు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రత్నం రెడ్డి, కంఠ ఉదయ్ కుమార్, వల్లం గోపి, భరత్ రెడ్డి, పటాన్ ఫరీద్, సురేష్ రెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి ముని కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

*-శ్రీకాళహస్తి, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):*

## నేడు కురుమల ఆత్మగౌరవ భవనం ప్రారంభం



సిద్దిపేట, డిసెంబర్ 13 (నిఘా న్యూస్): నేడు రంగారెడ్డి జిల్లా హైదరాబాద్ కోకాపేటలోని దొడ్డి కొమురయ్య కురుమ ఆత్మగౌరవ భవన ప్రారంభోత్సవానికి, సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం కొండపాక మండల పరిధిలోని కురుమలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కొండపాక మండల కురుమ సంఘం అధ్యక్షులు ఎర్రోళ్ల రమేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ నేడు జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎగ్గే మల్లేశం హాజరువుతున్నట్లు తెలిపారు.

## లోక్ అదాలత్ ను వినియోగించు కోవాలి

### ఉప్పల్ సీఐ ఎన్.ఎలక్షన్ రెడ్డి



ఉప్పల్, డిసెంబర్ 13 (నిఘా న్యూస్): ఈనెల 14న జరిగే మెగా లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని ఉప్పల్ సిఐ ఎన్ ఎలక్షన్ రెడ్డి సూచించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న కేసులకు సంబంధించి రాజీ కోరుకునే వారికి ఇది ఎంతో ఉపయోగ పడుతుందని తెలియజేశారు. ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పలు కేసులకు సంబంధించి కక్షిదారులు అవకాశం వినియోగించుకోవాలని కోరారు.

## ఉపాధ్యాయులకు గుర్తింపు కార్డులు



మేడ్చల్, డిసెంబర్ 13 (నిఘా న్యూస్): మేడ్చల్ మండలంలోని ఉపాధ్యాయులకు పిఆర్టియు టిఎస్.మేడ్చల్ మండల శాఖ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులు ఇవ్వడం జరిగింది. ఈ గుర్తింపు కార్డులను రిటైర్డ్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. రామారావు, గుండ్లపోచంపల్లి ప్రధానోపాధ్యాయులు రంగాచారి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వైరామేశ్వర గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు నరేంద్ర గౌడ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శేఖర్ రెడ్డి, రాష్ట్ర సెక్రెటరీ వెంకటరావు, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, మండల అసోసియేట్ అధ్యక్షులు తవిటి నాయుడు, నాయుడు, జగదీష్, మండల ప్రధాన కార్యదర్శి రజిత మేడం, వెంకటరత్నం, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పై దాడి హేయమైన చర్య

### వలిగొండ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్




వలిగొండ, డిసెంబర్ 13 (నిఘా న్యూస్): వలిగొండ పట్టణ కేంద్రంలో ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులపై దాడి చేసిన సినీ నటుడు మోహన్ బాబు పై చట్టరీత్య చర్య తీసుకోవాలని వలిగొండ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షులు బాలగోని హనుమంతు గౌడ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ అన్నారు. మరొకసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మారగోని శ్రీనివాస్ గౌడ్ ఉపాధ్యక్షులు రెబ్బ కుమార్ ప్రధాన కార్యదర్శి బల్గూరి వెంకట్ రెడ్డి కోశాధికారి మార్క భగవంతు కార్యదర్శి కృష్ణస్వామి మీడియా ప్రతినిధి సంగిశెట్టి క్రిస్టఫర్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు కె.కేశవరావును మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ నాయకులు గంథం నాగేశ్వరావు సురం శంకర్ చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.
–ఉప్పల్, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):

## చౌటుప్పల్ లో మహా పడిపూజ

**చౌటుప్పల్, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** చౌటుప్పల్ మండలం దండు మల్కాపూర్ గ్రామం లో శుక్రవారం ఆకుల ఉప్పలయ్య గురుస్వామి 18వ మహాపడి పూజా కార్యక్రమం సర్వసతీ పుత్రుడు రమణ గురు స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉప్పలయ్య గురుస్వామిని దేప శ్యాంసుందర్ ముదిరాజ్ సన్మానించారు. ఈ పూజా కార్యక్రమంలో పబ్బు శ్రీనివాస్ గౌడ్, నెల్కికంటి హరిప్రసాద్, పల్లెకాడు దర్శన్, బుర్ర శివ కుమార్ గౌడ్, దౌడి లింగస్వామి, ముదిగొండ మహేష్,నెల్కికంటి శ్రీకాంత్ తదితర అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

## వేములవాడలో ఆర్పి ల ముందస్తు అరెస్ట్ తగదు

### మున్సిపల్ చైర్మన్ మాధవి




**వేములవాడ, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** వేములవాడ నుండి చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తున్నారని ముందస్తుగా ఆర్పిలను అరెస్టు చేసిన పోలీసులు. ఆర్పిల సమస్యలను వెంటనే ప్రభుత్వం నెరవేర్చాలని సంఘీభావం తెలిపిన మున్సిపల్ చైర్ పర్సన్ మాధవితో పాటు కౌన్సిలర్లు సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్ వెళుతున్న మహిళ ఆర్పిలను అదుపులోకి తీసుకోవడం సమంజసం కాదని మహిళా సంఘాల్లో పనిచేస్తున్న సిబ్బందికి సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు, ఆర్పీలు, బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## వికలాంగుల ఆశ్రమాన్ని తనఖీ చేసిన జడ్జి ఉషశ్రీ



**వలిగొండ, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని టేకుల సోమారం గ్రామ సమీపంలో గల మానసిక వికలాంగుల ఆశ్రమాన్ని సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఉషశ్రీ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సందర్శించారు. సాధన మానసిక వికలాంగుల కేంద్రంలో మానసిక వికలాంగుల స్థితిగతులను పరిశీలించి వారికి నిత్యం అందించే ఆహార పదార్థాల మేను రిజిస్టర్తనిఖీ చేసి మానసిక వికలాంగులకు అందించవలసిన మేనూ, మానసిక వికలాంగుల ఆశ్రమంలో గల మానసిక వికలాంగులను అడిగి అడిగి తెలుసుకుని వారికి అందియవలసిన సౌకర్యాలను సదుపాయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ దంతూరి సత్తయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏటీఎంలో చోరీ నిందితుడి అరెస్టు



**నారాయణపేట, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** నారాయణపేట పట్టణంలోని కెబిఎస్ బ్యాంకు పక్కన గల కేబీఎస్ ఏటీఎంలో గుర్తు తెలియని వ్యక్తి గత రాత్రి ఏటీఎం లోకి చొరబడి ఏటీఎం ధ్వంసం చేసి అందులో ఉన్న డబ్బులు దొంగతనం చేయడానికి ప్రయత్నం చేశాడు. కానీ డబ్బులు ఏమి పోలేదని కేబిఎస్ బ్యాంక్ మేనేజర్ పి. బాల వెంకటన్న తెలిపారు. మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన నారాయణపేట టౌన్ పోలీసులు కేవలం రెండు గంటల్లోనే అట్టి దొంగతనానికి పాల్పడిన నారాయణపేట కురువగేరికి చెందిన తోళ్ల మల్లేష్ (40) అనే వ్యక్తిని పట్టుకొని అట్టి ఏటీఎం ను ధ్వంసం చేసి డబ్బులు దొంగిలించ ప్రయత్నించడానికి ఉపయోగించిన ఒక కొడవల్ని అతని వద్ద నుండి స్వాధీనం చేసుకోవడం జరిగింది. కేవలం రెండు గంటల్లోనే ఇట్టి కేసు చేదించి నిందితుని పట్టుకున్న నారాయణపేట టౌన్ పోలీసులను ఎస్ఐ వెంకటేశ్వర్లును, ఎస్ఐ2 కృష్ణ దేవ్, రాము, ఆంజనేయులు, లింగ మూర్తి లను నారాయణపేట సీఐ శివశంకర్ అభినందించారు.

# విధులు బహిష్కరించిన మున్సిపల్ కార్మికులు

- పనిముట్లు ఇవ్వకుండా పనులు చేయాలని వేధింపులు
- మున్సిపల్ కార్మికులపై అధికారులు కక్ష్య సాధింపు ఆపాలి




**శ్రీకాకుళం, డిశెంబరు 13 (నిఘా న్యూస్):** మున్సిపల్ కార్మికులకు పెంచిన మస్టర్ పాయింట్లను తగ్గించాలని, అధికారుల వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు అరుగుల గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం డిమాండ్ చేశారు.గతంలో ఉన్న మూడు మస్టర్ పాయింట్ల స్థానంలో ఐదు మస్టర్ పాయింట్లుగా పెంచడం వలన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని,ఈ నిర్ణయంను వెనక్కి తీసుకోవాలని నాయకులు అధికారులను కోరినా పట్టించుకోక పోవడంతో శుక్రవారం నుండి కార్మికులు విధులు బహిష్కరించి శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్దకు చేరుకొని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ కు సమస్యను వివరించారు. సమస్య పరిష్కారానికి మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చొరవ చూపక పోవడంతో అధికారుల మొండివైఖరికి నిరసనగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్న మస్టర్ పాయింట్ల స్థానంలో కొత్తవి రెండు ఏర్పాటు చేయడం వలన ఉదయం విధులకు హాజరవ్వడానికి ఆటోలు దొరకక పోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రోజుకు యాభై రూపాయలు ఆటో చార్జీలకే వెచ్చించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు పనిముట్లు పూర్తిగా ఇవ్వకుండా పనిచేయాలని వేధింపులు గురి చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. పుష్కాట్లు, బిన్నులు, పెద్ద కాంపాక్టరు వెహికల్స్ రిపేర్ ఉన్నా పట్టించు కోవడం లేదని అన్నారు. క్లాప్ వెహికల్స్ ద్వారా ఇంటింటికి వెళ్ళి తడి చెత్త పొడి చెత్త ఒక్కో ఇంటి నుంచి కేజీకి తక్కువ కాకుండా కార్మికులు తీసుకొని రావాలని లేకపోతే ఆబ్సెంట్ వేస్తామని అధికారులు బెదిరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తమ వైఖరి మార్చుకొని కార్మికుల సమస్య పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ ఫెడరేషన్ శ్రీకాకుళం నగర కమిటీ నాయకులు కళ్యాణ. రాజు, ఆకుల. శంకరరావు, డి.చిట్టీ, ఏ.రాము,డి.యుగంధర్, ఏ.శేఖర్, ఏ.జనార్దన్, ఏ.గురుస్వామి, జె.మాధవి. ఏ.రాజేశ్వరి, పార్వతి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఏటూరు నాగారం లో 80 లక్షలతో సెంట్రల్ లైటింగ్

### మార్కింగ్ చేయడాన్ని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



**ఏటూరు నాగారం, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** ములుగు జిల్లా ఏటూరు నాగారం మండల కేంద్రంలో వై జంక్షన్ నుండి చాపల మార్కెట్ వరకు సెంటర్ లైటింగ్ పనులను కొరకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రి సీతక్క చొర్వతో ఇటీవల 80 లక్షలు మంజూరు చేయగా శుక్రవారం ఆర్అర్ డిపార్ట్మెంట్ ఎస్ ఈ అధికారి,సదరు కాంట్రాక్టర్ ఇట్టి పనులకు గాను మార్కింగ్ చేపట్టడాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిటమట రఘు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్స వడ్ల వెంకన్న మండల నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ గ్రామీణఅభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రివర్యులు దనసరి అనసూయ సీతక్కకు మండల ప్రజలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి ఎండీ గౌస్ పాషా, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్న ఎల్లయ్య,కన్నాయిగూడెం మండల ఇంచార్జి జాడి రాంబాబు, జిల్లా, మండల, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తల్లోజును సన్మానించిన బిజెపి నేతలు



**ఉప్పల్, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** ఉప్పల్ నియోజకవర్గం సభ్యత్వ నమోదు, సంస్థాగత ఎన్నికల విషయమై శుక్రవారం నాచారం డివిజన్ పరిధిలో సభ్యత్వ నమోదు జిల్లా సభ్యులు, ఉప్పల్ నియోజకవర్గం బిజెపీ సభ్యత్వ నమోదు ఇంచార్జ్ పోతగాని గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాతీయ బీసీ కమీషన్ మాజీ సభ్యులు,జిల్లా ఎన్నికల ఇంచార్జి తల్లోజు ఆచారి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.వి.ఎస్.ఎస్.ప్రభాకర్ జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ సభ్యత్వ నమోదు విషయంలో క్రియాశీలక సభ్యత్వ విషయంలో జిల్లాలో ఉప్పల్ నియోజకవర్గం ముందంజలో ఉంది. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు సమిష్టిగా కలసిమెలసి పనిచేయాలని, పార్టీ ఆదేశానుసారం బూత్ కమిటీ, డివిజన్ కమిటీలు ఏర్పాటు చేయాలని, ప్రతి ఒక్కరు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎన్.వి ఎస్.ఎస్.ప్రభాకర్ మాట్లాడుతూ సంస్థాగత ఎన్నికల విషయంలో పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనుందని, బిజెపి పార్టీ మిగిలిన పార్టీల్లా కుటుంబ పార్టీ, ప్రాంతీయ పార్టీ కాదని ప్రజా పార్టీ అనీ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, ఉప్పల్ మాజీ శాసనసభ్యులు బేతి సుభాష్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు నర్సింగ్ రావు,ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్, రాష్ట్ర కౌన్సిల్ మెంబెర్ సతీష్ కుమార్, మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు శిల్ప రెడ్డి, ఎన్నికల సహ ఇంచార్జ్ రావుల బాలకృష్ణ, ఎస్ టి మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయక్, రామంతాపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి, సూర్య రావు ఉప్పల్ నియోజకవర్గ సంఘటన పర్వ్ లో భాగంగా ఎన్నికల ఇంచార్జులు, సహ ఇంచార్జులు, డివిజన్ అధ్యక్షులు, క్రియాశీలక సభ్యత్వ ఇంచార్జ్ లు,పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్ని దానాల్లో విద్యాదానం గొప్పది

### కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు భీమిడి ప్రదీప్



**చౌటుప్పల్, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** అన్నిదానాల్లో విద్యాదానం గొప్పదని, విద్యను ప్రతి ఒక్కరికి పంచుతూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బీమిడి ప్రదీప్ అన్నారు. తన జన్మదినం పురస్కరించుకొని మండలంలోని స్వాములవారి లింగోటం గ్రామంలో శు క్రవారం వాలంటరీ ఉపాధ్యాయునిలకు ప్రదీప్ వేతనాన్ని అందజేశారు. అనంతరం ప్రదీప్ మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను గమనించి తనవంతుగా విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉన్నత విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తు బాగు పడుతుందని, అలాంటి విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరు చేయూతనందించాలని అన్నారు. గ్రామంలోని యువత తమ జన్మదిన వేడుకల సందర్భంగా సామాజిక సేవలు కార్యక్రమాలు చేపడితే బాగుటుందని అభిప్రాయపడ్డారు. అంతకుముందు విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ప్రదీప్జీని పాఠశాల హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, సింగిల్ విండో వైస్ చెర్మన్ చెన్నగోని అంజయ్య, దేవాలయ కమిటీ చెర్మన్ కుర్నాల వెంకటేష్, గ్రామశాఖ అధ్యక్షులు చేవెళ్లి కృష్ణ, మాజీ ఉపసర్పంచ్ గంగాపురం గంగాధర్, రాచకొండ నర్సింహా, బోడిగె ఆనంద్, గంగాపురం నరహరి, ధర్నె ఉపేందర్, బాతరాజు రాజీవ్, పులిగిల్ల ఇస్తారి, తూర్పింటి ఎల్లయ్య, పులిగిల్ల బిక్షమయ్య, చొప్పరి సాయి కుమార్, చేగురి దేవేందర్, మైలారం రాము తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటి వద్ద చెత్త సేకరణ విధిగా నిర్వహించాలి

### తిరుపతి మున్సిపల్ కమిషనర్ ఎన్.మౌర్య



**తిరుపతి, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** తిరుపతి నగరంలో ప్రతి ఇంటి వద్ద, వ్యాపార సముదాయాల వద్ద నుండి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరణ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, వాహనాల జిపిఎస్. ట్యాగింగ్, వాహనాల రూట్ మ్యాప్ తదితర అంశాలపై హెల్త్, ఇంజినీరింగ్ అధికారులతో శుక్రవారం సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ఇంటింటి వద్ద నుండి, వ్యాపార సముదాయాలు, అపార్ట్మెంట్లు నుండి తడి, పొడి చెత్త సేకరణ విధిగా చేపట్టాలని అన్నారు. వాహనాలు ఏ ఏ మార్గాల్లో ఎన్ని గంటలకు వెళుతున్నాయి, వాహనంతో పాటు ఎంతమంది వెళుతున్నారు అని విషయాలు నమోదు చేయాలని అన్నారు. వంద శాతం ముఖ ఆధారిత హాజరు నమోదు చేపట్టాలని అన్నారు. ప్రతి వాహనానికి జిపిఎస్ ఏర్పాటు ఎక్కడ తిరుగుతున్నాయి అనే విషయాలు రికార్డు చేయాలని అన్నారు. తెల్లవారు జామునే నగరంలోని చెత్త కుప్పలు తొలగించి, పారిశుద్ధ్య పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. మురుగు నీటి కాలువల్లో చెత్త తొలగింపు నిత్యం జరిగేలా చూడాలని అన్నారు. బల్క్ వేస్ట్ జనరేటర్స్ ను గుర్తించి వారే చెత్త నిర్వహణ చేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. వార్డులకు ప్రత్యేకంగా నియమించిన అధికారులు పర్యవేక్షించి మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, డిఈలు మహేష్, రమణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపి. మహాపాత్ర, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతీ, శానిటరీ ఇన్స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలలో రాణించండి




**కర్నూల్, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** నేటి నుండి అనంతపురం పట్టణంలో జరగనున్న 7 వ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళా షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొనే కర్నూలు జిల్లా మహిళా జట్టుకు శుక్రవారం పట్టణంలోని గుడ్ షెఫర్డ్ పాఠశాల క్రీడా ఆవరణలో ఆ పాఠశాల కరస్పాండెంట్ ఏసుదాసు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జట్టుకు క్రీడా దుస్తులు పంపిణీ చేసిన అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ జాతీయ స్థాయి పోటీలలో కూడా రాణించాలని ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహిత్సానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర షూటింగ్ బాల్ ప్రధాన కార్యదర్శి పరుశ రాముడు, జిల్లా కార్యదర్శి నాగరాజ్, అసోసియేషన్ సభ్యులు మధుసూదన్, సురేష్ కుమార్, సుభాన్ భాష, కిరణ్ కుమార్, ఉపేంద్ర, అమృత తదితరులు పాల్గొన్నారు. మహిళల జట్టు: గీతాంజలి, ప్రియాంక, స్వాతి, ప్రవల్లిక (కంబాలపాడు) భూమిక, పూజిత, సాయి వర్షిని, లక్ష్మీ భవాని, మేఘన, జ్యోతి ప్రియా (కర్నూలు), గీత, మమత శ్రీ (ఓర్వకల్) కోచ్: సురేష్ కుమార్, మేనేజర్: అమృత.

## తనపై ఆరోపణలు రుజువు చేయండి

### మాల మహానాడు మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్



**అడ్డగూడూరు, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** తనపై కావాలని అసత్య ఆరోపణలు చేస్తున్నారని మాజీ మాల మహానాడు మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలిజాల ప్రవీణ్ జయప్రకాష్ అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన సంఘం నడవాలంటే నీ తరఫున ప్రతినెల డబ్బులు పంపించాలని మాల మహానాడు సంఘం నాయకులు తనను వత్తిడి చేయడంతో తన వల్ల కాదని పదవి నుండి తప్పుకున్నానని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు వి.ఎల్ రాజు, రాష్ట్ర అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ కు వాట్సాప్ ద్వారా రాజీనామా పత్రాన్ని అందించానని తెలిపారు. నా రాజీనామాని మనసులో పెట్టుకొని నాపై కులం పరంగా, రాజకీయంగా దెబ్బ తీయాలనే కోణంలో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని నాపై పెట్టిన ఆరోపణలు రుజువు చేయని ఎడల న్యాయం జరిగే వరకు పోరాడుతానని తెలిపారు. సెప్టెంబర్ 29, 30న వ్యక్తిగత కారణాల వలన పదవి నుండి తప్పుకుంటున్నానని వడ్లమూరి కృష్ణ స్వరూప్, వి.ఎల్ రాజు లతో మాట్లాడానని అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గం, అడ్డగూడూరు మండలంలో మాల కుల సంఘం పేరు చెప్పుకొని డబ్బులు వసూలు చేశానని, ఇతర సంఘాలతో కలిశానని, ఆధారాలు లేకుండా సోషల్ మీడియాలో ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. సోషల్ మీడియాలో వచ్చిన అసత్య ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నానని హెచ్చరించారు.

## ఘట్కేసర్ బ్రిడ్జి సమస్య పరిష్కారానికి సహకరించాలి

### సహకార సంఘం చైర్మన్ రాంరెడ్డి



**ఘట్ కేసర్, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** ఘట్ కేసర్ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న బ్రిడ్జి సమస్యను జటిలం చేయకుండా పరిష్కారం దిశగా అన్ని పార్టీలు కలిసి పని చేయాలని ఘట్ కేసర్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి కోరారు. ఘట్ కేసర్ పట్టణంలో బ్రిడ్జి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలనే డిమాండ్ చేస్తు పట్టణ జేఏసీ కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలో క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృపానిధి, కుమార్, జాషువా, యేసు రమేశ్, ఎస్ ఫ్రేమ్, కేశవ్ కుమార్, రిబ్కా శ్యామ్, రుబేన్, దర్శనం దావీడ్ లు కూర్చున్నారు. వారికి మండల రైతు సేవా సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, మాజీ చైర్మన్ సార శ్రీనివాస్ గౌడ్, డైరెక్టర్ రేసు లక్మారెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు చందుపట్ల వెంకట్ రెడ్డి, బేతాళ నర్సింగ్ రావు, బీఆర్ఎస్ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ఎండీ సిరాజ్, జేఏసీ సభ్యులు ప్రమోద్ గుప్తా, కమలాకర్, బచ్చు నగేష్ గుప్తా, పల్లె విజయ్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు గోపాల్ రెడ్డి, రఘు సంఘీభావంతెలిపారు. ఈకార్యక్రమంలోనాయకులు రొడ్డ యాదగిరి, సత్యనారాయణ, వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం వజ్రోత్సవాలు



**జగిత్యాల, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ పరిశోధన స్థానం పోలాసలో వజ్రోత్సవాలకు హాజరై, వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్ళను పరిశీలించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసి, ఉత్తమ రైతులను సత్కరించిన విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి ఈ కార్యక్రమంలో ఏ డీ ఆర్ రఘురాం, శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి, సత్య ప్రసాద్, కోటేశ్వర రావు, అధ్యాపకులు, రైతులు, విద్యార్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 20న.. మాదిగ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

### ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రత్నాకర్ మాదిగ



**ఎర్రపాలెం, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** మాదిగల భావితరాల భవిష్యత్తు కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్క మాదిగ విద్యార్థి భాగస్వాములు కావాలని ఎంఎస్ ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఊటుకూరు రత్నాకర్ మాదిగ కోరారు.శుక్రవారం మండలంలోని బనిగళ్ళపాడు జూనియర్ కళాశాలలో మాదిగ విద్యార్థులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 20న ఉమ్మడి ఖమ్మం జిల్లా వేదికగా ఖమ్మం అంబేద్కర్ భవనంలో మాదిగ విద్యార్థులతో జరిగే ఆత్మీయ సమ్మేళన సదస్సును జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ దస్సుకు ముఖ్యఅతిథిగా మందకృష్ణ మాదిగ హాజరవుతారని మాదిగ విద్యార్థులంతా సదస్సుకు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సదస్సులో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సి వర్గీకరణ అమలు చేసే వరకు ఉద్యమ కార్యచరణ, ప్రజా సమస్యలపై పోరాటాలు తదితర అంశాలపై మందకృష్ణ మాదిగ ప్రసంగించుకున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు సుగుర్తి శ్యాం ప్రసాద్ మాదిగ,కొత్తపల్లి సాయి మాదిగ,చందు మాదిగ,విజయ్ మాదిగ,వంశీ మాదిగ,విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.


## అధికారుల పై మంత్రి తుమ్మల ఆగ్రహం



**అశ్వారావుపేట, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం అశ్వరావుపేటలో సెంట్రల్ లైటింగ్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి తుమ్మల డ్రైనేజీ పనులపై తీవ్ర అసహనం వ్యక్తం చేసి అధికారులపై మండిపడ్డారు. ఆర్ అండ్ బి నియమ నిబంధనలకు లోబడి రోడ్డు విస్తరణ పనులు పారదర్శకంగా జరగాలని, ఎక్కడా పక్షపాతం వహించవద్దని, తుమ్మల నాగేశ్వరరావు స్థలం పోతున్నా కూడా వెనకడుగు వేయకుండా రోడ్డు పనులు జరగాలని ఆదేశించారు. రోడ్ల నిండా చెత్తాచెదారం పేరుకుపోయి అస్తవ్యస్తంగా ఉన్న పట్టణాన్ని చూసిన మంత్రి తుమ్మల గ్రామపంచాయతీ సిబ్బంది ఏం చేస్తున్నారంటూ మండిపడ్డారు. 24 గంటల్లోపు టౌన్ మొత్తం క్లీన్ గా చేయాలని ఆదేశించారు.

## కాలువల నిర్మాణానికి అంచనాలు తయారు చేయండి

### మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున



**ప్రొద్దుటూరు, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** రోడ్లు, కాల్వల నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. శుక్రవారం కమిషనర్ మల్లికార్జున పట్టణ పర్యటనలో భాగముగా శివాలయం సెంటర్ పాత తృప్తి బేకరి వద్ద ఉన్న చెత్త పాయింట్ ను పారిశుద్ధ్య కార్మికులచే శుభ్రం చేయించడం జరిగింది. స్థానిక బొల్లవరంలోని బుడ్డాయి పల్లె వీధి నందు అక్కడి ప్రజలు రోడ్లు కాలువలు కావలసిందిగా కోరారు. ఇందుకు సంబంధించిన ఇంజనీరింగ్ విభాగం వారికి అంచనాలు తయారు చేయవలసిందిగా ఆదేశాలు జారీ చేశారు. అలాగే అక్కడి ప్రజలతో చెత్త సేకరణ మంచినీటి సరఫరా, వీధి దీపాల సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్, యస్ నూర్ బాషా, ఒకటవ వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### ఏ ఐ టీ యూ సి నేతల డిమాండ్

**సిరిసిల్ల, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** రాజన్న సిరిసిల్లలో శుక్రవారం జిల్లా ఏఐటీయూసీ,భవన నిర్మాణ కార్మిక సంఘము ఆధ్వర్యంలో, కలెక్టరేట్ ముందు జరిగిన ధర్నా కార్యక్రమంలో జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ భవన నిర్మాణంలో సుతారీలుగా, సెంట్రింగ్ కార్మికులుగా, ప్లంబర్లుగా, ఎలెక్ట్రిసియన్లుగా, పేయింటర్లుగా, మార్బుల్ కార్మికులు, ట్రాక్టర్ లేబర్, వడ్డెర మొదలగు వేలాది కార్మికులు రాజన్న సిరిసిల్ల జిల్లాలో భవన నిర్మాణంలో పనిచేస్తున్నారని వారి చేతి వేళ్ళు అరిగి ఆన్లైన్ లో థంబ్ సిస్టం రావడం లేదని, కావున ప్రభుత్వం థంబ్ సిస్టం ను రద్దు చేయాలని,ఆన్లైన్ ను వెంటనే పునరుద్ధరణ చేసి, నూతన లేబర్ కార్డులను,పెండింగ్ ఫైల్స్ ను క్లియర్ చేయాలని,అర్హులైన కార్మికులకు డబుల్ బెడ్ రూంలను ఇవ్వాలని, వలస కార్మికుల వలన స్థానిక కార్మికులకు ఉపాది కరువైనందువలన, వెంటనే స్థానిక కార్మికులకు ఉపాధి చూపాలని,55 సంవత్సరాలు నిండిన




కార్మికులకు ఐదు వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని,లాప్స్ అయిన లేబర్ కార్డులను పునరుద్ధరించాలని,రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఏ సీ ఎల్. డి సి ఎల్లను. నియమించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని,రేషన్ కార్డునే-ఫ్యామిలీ మెంబర్ కార్డుగా గుర్తించి, చనిపోయిన కార్మిక కుటుంబాలకు పూర్తి బెనిఫిట్స్ అందించాలని,రేషన్ కార్డు లేని కార్మికులకు ఆధార్ కార్డునే గుర్తింపు కార్డుగా లేబర్ కార్డుల జారీ చేయాలని, ఆక్సిడెంట్ గా చనిపోయిన కార్మికులకు10 లక్షల రూపాయలు ఇవ్వాలని,ప్రతిరోజు ఇసుక, మొరం పర్మిషన్లు ఇవ్వాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ని కోరుతూ ఇట్టి విషయాలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాజుల పోశెట్టి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు,అజ్జ వేణు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు, దుంద్రపెల్లి. రవీందర్, శ్రీరాములు. నర్సయ్య వేములవాడ రూరల్, మండల భవన నిర్మాణ కార్మిక సంగం,పండుగ పోచమల్లు, పెంట. మల్లయ్య, గాజుల. మల్లయ్య, గంగ లక్ష్మి రాజాం,శ్రావనపెల్లి మల్లేశం, పందిపెల్లి. శేఖర్, జనగం. లక్ష్మన్, సంద్రగిరి. లక్ష్మికాంత్, మామిడాల. నర్సయ్య, మల్లారపు. రాజు, బొల్లే.బాబు కొనారావుపేట మండల భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల కోసం ఇంటింటి సర్వే

**ముస్తాబాద్, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేందుకు అధికారులు సర్వే చేపడుతున్నట్లు ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలనలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ పట్టణ కేంద్రంలో ఇండ్లు లేని నిరుపేదలు ఇందిరమ్మ ఇండ్ల కోసం 1680 మంది దరఖాస్తు చేసుకోవడం జరిగిందని,అట్టి ఇండ్ల మంజూరు కోసం అధికారులు ఇంటింటా సర్వే చేపట్టారు. అధికారులతో పాటు కాంగ్రెస్ పార్టీ మండల పట్టణ అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి, గజ్జెల రాజు అలాగే పార్టీ నాయకులు సైతం దరఖాస్తులు చేసుకున్న వారి వద్దకు వెళ్లి వివరాలను పరిశీలించారు. అనంతరం అధికారులు ఆన్లైన్లో వారి వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా బాల్ రెడ్డి, రాజు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయడం జరిగింది. అందులో భాగంగానే పేదలకు వారి సొంత స్థలం ఉంటే ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇస్తుందని వెల్లడించారు. ఇచ్చిన మాట ప్రకారమే ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారికి ప్రభుత్వం తప్పకుండా ఇండ్ల నిర్మాణాలు



చేపడుతుందని తెలిపారు. తమ ఇంటికి వస్తున్న అధికారులకు దరఖాస్తు చేసుకున్నవారు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గజ్జల రాజు, నాయకులు ఉచ్చిడి బాల్ రెడ్డి, తాళ్ల విజయ్ కుమార్, రంజాన్ నరేష్, శీల ప్రశాంత్, మిడిదొడ్డి భాను గ్రామ పంచాయితీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి

### యుటిఎఫ్ మండల అధ్యక్షులు సుగంధి రవికుమార్



**తాండూరు, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** ఉపాధ్యాయుల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తామని టీ.ఎస్ యుటిఎఫ్ ఉపాధ్యాయుల సంఘం మండల అధ్యక్షులు సుగంధి రవికుమార్, గౌరవ అధ్యక్షులు వై.విష్ణుమూర్తి, ప్రధాన కార్యదర్శి వెంకటప్ప వెల్లడించారు. బషీరాబాద్ మండల టీ.ఎస్. యుటిఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఉపాధ్యాయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సుగంధి రవికుమార్ ను ఎన్నుకున్నారు. వీరు బషీరాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు.ప్రధాన కార్యదర్శిగా వెంకటప్ప ను ఎన్నుకున్నారు. వీరు మండల పరిధిలోని మైల్వార్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యక్షులుగా జగదీష్ రెడ్డి ఘనపూర్ పాఠశా ల, మహిళా ఉపాధ్యక్షులుగా మంజుల బషీరాబాద్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, బాలమణి రెడ్డి ఘనాపూర్ పాఠశాల, కోశాధికారిగా వెంకటయ్య గోటిగా ఖుర్దు పాఠశాల, కన్వీనర్ గా శేషగిరి బషీరాబాద్ ప్రాథమిక పాఠశాల, కార్యదర్శిగా అంబ ప్రసాద్ దామర్చెడు పాఠశాల. ఈ శుభ సందర్భంగా వీరందరూ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి అహర్నిశలు కృషి చేస్తామని వెల్లడించారు.

# ఈనెల 20న సంస్కృతి టౌన్షిప్ ఎన్నికలు

### అసోసియేషన్ ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్న అధ్యక్ష అభ్యర్థి బెజ్జంకి

**ఘట్ కేసర్, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్షిప్ లో ఈనెల 20న జరగబోయే అసోసియేషన్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బెజ్జంకి హరిప్రసాదరావు ప్రచారంలో దూసుకెళ్తు ప్రజల ఆదరణ పొందుతున్నాడు. ముడుసార్లు అధ్యక్షుడిగా, మూడుసార్లు కోశాధికారిగా, ఒకసారి కౌన్సిలర్ గా పదవులును అనుభవించి, అపారమైనటువంటి అనుభవం తోనే మరోసారి సాంస్కృతి టౌన్షిప్ లో అసోసియేషన్ ఎన్నికల బరిలో దిగారు. ఏడుసార్లు వివిధ పదవుల కోసం పోటీ చేసి, ఓటమిని ఎరగని నాయకుడు బెజ్జంకి హరి ప్రసాద్ రావు, 8వ సారి ఈనెల 20 తారీకు సాయంత్రం సంస్కృతి టౌన్షిప్ అధ్యక్షుడిగా విజయం సాధించబోతున్నాడని హరి ప్రసాద్ రావు అభిమానులు, పలువురు నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష అభ్యర్థి హరి ప్రసాద్ రావు నిఘా ప్రతినిధితో మాట్లాడుతూ ఏడుసార్లు ఓటమి ఎరుగని అనుభవంతో టౌన్షిప్




అధ్యక్షుడిగా మూడుసార్లు, కోశాధికారిగా మూడుసార్లు, కౌన్సిలర్ గా ఒకసారి పదవులలో ఉండి ఎంతో అభివృద్ధి చేశానని తెలిపారు. ఆ అభివృద్ధిని చూసి ప్రజలు మరోసారి పోటీ చేసే అవకాశం నాకు ఇచ్చారని వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈసారి కూడా అవకాశం ఇచ్చి గెలిపించినట్లయితే టౌన్షిప్ ను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు.

# డిసెంబర్ 21న.. ఉద్యమ కళాకారుల రాష్ట్ర సదస్సు



### యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్చార్జి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజయ్య

**వలిగొండ, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలో డిసెంబర్ 21న సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్ లింగంపల్లి హైదరాబాద్ ఆత్మగౌరవ రాష్ట్ర సదస్సు నిర్వహించడం జరుగుతుంది. ఉద్యమ కళాకారుల హక్కుల పరిరక్షణకు అందరూ కదలి రావాలని ప్రధానంగా ఉద్యమకారులు ఉద్యమ కళాకారులు ఇందులో పాల్గొని ప్రభుత్వానికి విన్నవించుకోవడానికి తరలి రావలసిందిగా యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్చార్జి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న పిలుపునిచ్చారు. అనంతరం తెలంగాణ ఉద్యమ కళాకారుల ఆత్మగౌరవ సదస్సు కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ కళాకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి పదివేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని, అర్హులైన కళాకారులకి తెలంగాణ ఉద్యమ నాయకుడు నెలకు 25 వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలని, సాంస్కృతిక సారథులుగా 1000 మంది అర్హులైన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఇందిరమ్మ ఇండ్లలో 10 శాతం వాటా ఉద్యమ కళాకారులకు కేటాయించాలని, కళాకారులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులను అందజేయాలని పై కోర్కెలు ప్రభుత్వము ఆమోదించి అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో కళ్లెం లక్ష్మారెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లా గౌరవ అధ్యక్షులు, తొలి మలిదశ వలిగొండ ఉద్యమ జేఏసీ నాయకులు. బత్తిని రవీందర్, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, ఉద్యమకారుల ఫోరం సాంస్కృతిక విభాగం జిల్లా కార్యదర్శి మారగొని శ్రీనివాస్ గౌడ్, వలిగొండ మండల అధ్యక్షులు శీలం స్వామి రాష్ట్ర కో కన్వీనర్, బత్తిని సత్యనారాయణ, ఎక్కల దేవి శ్రీనివాస్, దండ మల్లికార్జున్, జినుకల దానయ్య, కొండూరు సత్తయ్య, ఉద్యమకారుల ఫోరం జిల్లా నాయకులు ఎండి.ఇమామ్ సాబ్ తదితరులు పాల్గొన్నారు.



బాగ్ అంబర్ పేట్ డివిజన్ లో అంబర్ పేట శాసనసభ్యుడు కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ పద్మ శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు డివిజన్ లోని శాంతినగర్, చెంచబస్తి, ది హోప్ చర్చ్ లైన్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు.

*-అంబర్ పేట, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):*

## ఇందిరమ్మ ఇళ్లలో జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వండి

### ఎమ్మెల్యే అయిలయ్యకు వినతి పత్రం అందజేసిన టీజేయు జిల్లా అధ్యక్షులు



**యాదగిరిగుట్ట, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** యాదగిరిగుట్టలో ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ గృహ పథకం క్రింద జర్నలిస్ట్ లకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కు వినతి పత్రం అందజేసిన తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ యాదాద్రి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులకు నివాస యోగ్యకరమైనటువంటి ఇండ్ల స్థలాలు అందజేసి, ఇందిరమ్మ గృహ పథకంలో మొదటి ప్రాధాన్యత కల్పించి ఇండ్లు కట్టించి ఇవ్వాలని, చాలామంది జర్నలిస్టులు అద్దె గృహాల్లో ఉంటూ దయనీస్థితిలో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ప్రత్యేక చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ జర్నలిస్టులకు ప్రభుత్వం అండగా ఉంటుందని గృహ పథకంలో జర్నలిస్టులకు మొదటి ప్రాధాన్యత కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. వారితో పాటు జర్నలిస్ట్ లు వెంకటేష్, హనుమంతు, సందీప్ రెడ్డి, సంతోష్, నరేందర్ పాల్గొన్నారు.

## ఆహార హక్కుకు భంగం కలగకూడదు

### అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలి

### తెలంగాణ ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



**నారాయణపేట, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** ఆహార భద్రత హక్కుకు భంగం కలగకుండా అధికారులందరూ క్షేత్రస్థాయిలో పర్యటించాలని తెలంగాణ ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. జాతీయ ఆహార భద్రత చట్టం 2013, అమలుపై నారాయణపేట కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో శుక్రవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ తో పాటు తెలంగాణ ఆహార కమిషన్ సభ్యులు గోవర్ధన్ రెడ్డి,రంగినేని శారద, బుక్య జ్యోతి, ఎం భారతి, అదనపు కలెక్టర్ బేన్ షాలం, ఆర్డీవో రామచంద్రనాయక్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆహార కమీషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రత చట్టం అమలులో భాగంగా కమీషన్ రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తూ పర్యవేక్షిస్తుందన్నారు. అందులో భాగంగానే శుక్రవారం నారాయణపేట జిల్లా మక్తల్ మండలంల కమిషన్ సభ్యులతో కలిసి పాఠశాలలలో మధ్యాహ్న భోజనం నాణ్యత, అంగన్వాడీలు, వసతి గృహాలు, నిత్యావసర సరుకుల పంపిణీ వ్యవస్థకు సంబంధించి తనిఖీలు నిర్వహించానన్నారు. ఒకటి రెండు చోట్ల విద్యార్థులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఆహార విషయంలో మెనూ ప్రకారం లేక పోవడంపై సంబంధిత సంక్షేమ వసతి గృహ సంరక్షకులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, లోపాలను సరిచేసుకుని నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించినట్లు తెలిపారు.

## రండి కలిసి భోంచేద్దాం

### విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించిన కలెక్టర్



**భువనగిరి, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** వసతి గృహాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు చేస్తున్న కృషిని చూడాల్సిందిగా కలెక్టర్ తల్లిదండ్రులను ఆహ్వానించారు. ప్రభు త్వం వారు వసతి గృహ విద్యార్థుల భోజన ఖర్చులను 40 శాతం పెంచారు. దాంతో పిల్లలకు మరింత నాణ్యమైన ఆహారాన్ని వడ్డిస్తున్నాము. ఈ విషయం మీకు గత నెలలోనే తెల్పి ఉన్నాం. అయితే, ఇప్పుడు మిమ్మల్ని మా వసతి గృహానికి నేటి ఉదయం 11.00 గం.లకు ఆహ్వానిస్తున్నాం. మీరు మాతో వసతి గృహానికి వచ్చిన ముఖ్య అతిథులతో కలిసి భోజనం చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఈ విధమైన నాణ్యమైన ఆహారాన్ని అందిస్తుంది కాబట్టి మీరు తప్పకుండా ఈ సంతోషంలో పాల్గొనాలని కోరారు.

## 2010లోపు పుట్టిన పిల్లల పేర్లను నమోదు చేసుకోండి

### జిహెచ్ఎంసి అంబర్ పేట సర్కిల్ ఎఎంహెచ్ఓ డా.హేమలత



**అంబర్ పేట, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** 2010 సంవత్సరం లోపు పుట్టిన పిల్లల పేర్లను ఇప్పటి వరకు ఎవరైతే జీహెచ్ఎంసీ రికార్డుల్లో నమోదు చేయించలేదో వారంతా డిసెంబర్ 31 లోపు పిల్లల పేర్లను బర్త్ అండ్ డెత్ సెక్షన్ లో నమోదు చేయించాలని జిహెచ్ఎంసి అంబర్ పేట సర్కిల్ ఎఎంహెచ్ఓ డాక్టర్ హేమలత తెలిపారు. ప్రభుత్వం ప్రత్యేక జీవో ద్వారా ఈ అవకాశాన్ని కల్పించిందన్నారు. డిసెంబర్ 31లోపు పిల్లల పేర్లను నమోదు చేయకపోతే ఇక ముందు నమోదు చేసుకునే అవకాశం లేదన్నారు. వెంటనే మీసేవా ద్వారా తల్లిదండ్రులు తమ పిల్లల పేర్లను నమోదు చేయించాలని ఆమె కోరారు.

## పడిపూజకు హాజరైన బిఎల్ఆర్



**నాచారం, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** నాచారంలోని అన్నపూర్ణ కాలనీ పార్క్ లో రవీందర్ యాదవ్ నిర్వహించిన 18వ మహా పడిపూజ కార్యక్రమానికి ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి హాజరై పూజలో పాల్గొనడం జరిగింది. అనంతరం తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. అయ్యప్ప స్వామీలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ప్రతిరోజు నిత్యం స్వామి పూజలో ఉంటూ కట్టిన దీక్ష చేస్తూ అయ్యప్ప స్వామి నిత్య ఆరాధన భక్తుశ్రద్ధలతో పూజలు చేస్తూ 41ఒక్క రోజుల దీక్ష పూర్తిచేసుకుని అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లి స్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరి ఉండాలని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయి జన్ శేకర్, బన్నాల ప్రవీణ్, ఎర్రగొల్ల మల్లేష్ యాదవ్, విఠల్ యాదవ్, కట్ట బుచ్చన్న గౌడ్, బ్రహ్మయ్య ,శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## దమ్మపేటలో అభివృద్ధి పనులు ప్రారంభం

### హాజరైన మంత్రి తుమ్మల ఎమ్మెల్యే జారే



**దమ్మపేట, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** దమ్మపేట మండలం అల్లిపల్లి గ్రామంలో శుక్రవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి ప్రారంభించారు.. దమ్మపేట మండల పరిధి లోని అల్లిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పంచాయతీ కార్యాలయ భవనం తోపాటు తుమ్మల ప్రధాన అనుచరుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్, అల్లిపల్లి గ్రామస్తుల సహకారంతో సొంతంగా నిర్మించిన పాఠశాల భవనాన్ని మంత్రి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్వాములకు అన్నదానం పూర్వజన్మ సుకృతం


### కౌన్సిలర్ కొత్త సురేఖ గౌడ్



**దమ్మాయిగూడ, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** నరసింహగౌడ్ గురు స్వామి నిర్వహించిన అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం దమ్మాయిగూడ మున్సిపల్ ఐదవ వార్డు కౌన్సిలర్ కొత్త సురేఖ గౌడ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అయ్యప్ప మాల ధరించిన స్వాములకు అన్నదానం చేయడం మహా పుణ్యమని కొత్త సురేఖ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ అయ్యప్ప స్వామి మాలధారణ స్వీకరించిన స్వాములకు అన్నదానం చేయడం మహాభాగ్యంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాండు గౌడ్, సంతోష్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, రవి, శ్రీధర్, కొత్త భాస్కర్ గౌడ్, సాంబ గౌడ్ అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

# సర్వ శిక్షా అభియాన్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

### సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావిస్తా: కూనంనేని



**ఖమ్మం, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** విద్యాశాఖలో సమగ్ర శిక్షా అభియాన్ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.ప్రభుత్వం అంగీకరించిన న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి జాప్యమెందుకని ఆయన ప్రశ్నించారు. కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సిఆర్పి ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులకు కూనంనేని సాంబశివరావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ మహిళా ఉపాధ్యాయులకు వర్తించే అన్ని సెలవులను కస్తూర్బా బాలికల విద్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులకు వర్తింపజేయాలని బోధన, బోధనేతర సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.ఉద్యోగులు వారం రోజులుగా నిరవధిక దీక్ష చేస్తున్న ప్రభుత్వం స్పందించక పోవడం శోచనీయమన్నారు. ఉద్యోగులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కూనంనేని సూచించారు. సమగ్ర శిక్షా అభియాన్, కస్తూర్బా బాలిక విద్యాలయాల్లో పనిచేస్తున్న బోధన,బోధనేతర సిబ్బంది సమస్యలపై శాసనసభలో ప్రస్తావిస్తానని ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని సాంబశివరావు హామీ ఇచ్చారు. సమగ్ర శిక్షా అభియాన్, కస్తూర్బా ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్,పిఆర్టియు నాయకులు యలమద్ది వెంకటేశ్వరరావు (వైవి) మద్దతు పలికారు. వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగమల్లేశ్వరరావు, కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉనికి కోసమే బిఆర్ఎస్ ధర్నా నాటకాలు




**పెబ్బేరు, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** కాంగ్రెస్ ప్రజాపాలనపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ, తమ ఉనికిని కాపాడుకోవడానికి బిఆర్ఎస్ కు చెందిన పాలకవర్గం,నాయకులు ధర్నాలు చేస్తూ డ్రామా మొదలుపెట్టారని బ్లాక్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం పెబ్బేరు ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నిధులు ఉన్నాయి. పనులు ప్రారంభించడం లేదని అబద్ధపు మాటలు మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నార వాపోయారు. టెండర్లయిన పనులకు నిధులు మంజూరై వెనక్కి వెళ్తే ఆ నిధులను ఎమ్మెల్యే మేఘా రెడ్డి తెచ్చాడని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రోడ్డు పనులను ఎందుకు పూర్తి చేయలే కపోయారని ప్రశ్నించారు.వారు చేసిన ధర్నాను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. అలాగే వనపర్తి రోడ్డుకు రెండు వైపులా ఉన్న ఇళ్లను పూర్తిస్థాయిలో ఎందుకు కూల్చలేక పోయారని అడిగారు. బీఆర్ఎస్ కు చెందిన నాయకుల ఇల్లు కూలగొట్టకుండా అట్లాగే ఉంచడాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా డ్రామాలు ఆపకపోతే ప్రజలు బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉందని అన్నారు.ఎమ్మెల్యే మేఘారెడ్డిని,ప్రభుత్వాన్ని తప్పు పడుతున్నారు. కనుక అదే వనపర్తి రోడ్డుపై ప్రజలతో చర్చ చేద్దాం అని, ఎవరిది తప్పో ప్రజలే చెప్తారని బీఆర్ఎస్ పార్టీ నాయకులకు ఆయన సవాల్ విసిరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎల్ల స్వామి,మార్కెట్ వైస్ ఛైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, నాయకులు దయాకర్ రెడ్డి, ఎస్సి సెల్ నాయకులు గంధం రంజిత్ కుమార్,ఎండి.షకిల్, వెంకటేష్ సాగర్,యుగంధర్ రెడ్డి,గంధం రాజశేఖర్, రాముడు,సురేందర్ గౌడ్,శివ పాల్గొన్నారు.

## విలువల పునరుజ్జీవనానికి ప్రేరణ




**సంగారెడ్డి, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** సనాతన ధర్మంలో ప్రాధాన్యత కలిగిన భగవద్గీత శ్లోకాలను పఠించి, మాస్టర్ మైండ్స్ టెక్నో స్కూల్ విద్యార్థులు గిన్నిస్ రికార్డు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ నవనీత మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఆధ్యాత్మికతను పెంపొందించడానికి, సాంప్రదాయ విలువలను పునరుజ్జీవింపజేసే కార్యక్రమాల్లో భాగంగా భగవద్గీత పఠనాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. 108 మంది విద్యార్థులతో చరిత్ర ఇటీవల జరిగిన అంతర్జాతీయ భగవద్గీత పోటీల్లో 108 మంది విద్యార్థులు శ్లోకాలు పఠించి ప్రపంచవ్యాప్తంగా పేరు తెచ్చుకున్నారు. ఈ ఘనతకు గౌరవ సూచకంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో టీజీఐఐసీసీ చైర్మన్ నిర్మల పాల్గొని విద్యార్థులను సన్మానించారు. సాంప్రదాయంతో సాంకేతికత కలయిక ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఆధ్యాత్మికతను కలపడం విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమని పాఠశాల యాజమాన్యం అభిప్రాయపడింది. భగవద్గీత పఠనం ద్వారా భౌతిక, మానసిక శాంతిని పొందే మార్గాలు విద్యార్థులకు నేర్పించడం జరిగింది. సామాజిక మార్పుకు సంకేతం విద్యార్థుల విజయాన్ని చూసి, వారి తల్లిదండ్రులు కుటుంబాల్లో ఆధ్యాత్మిక విలువలను పెంపొందించడానికి ప్రేరణ పొందుతున్నారు. భగవద్గీత సందేశం విద్యార్థుల ప్రవర్తన, క్రమశిక్షణ, చదువుపై ఆసక్తి పెంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తోంది.ప్రత్యేక అంశం: ఈ విజయంతో, భగవద్గీత శ్లోక పఠనంపై మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని, దేశంలోని పాఠశాలలలో ఆధ్యాత్మికతను చేర్చాలని విద్యారంగ నాయకులు సాంస్కృతిక వారసత్వానికి ఘనత భారతీయ సాంస్కృతిక విలువలను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పడంలో ఈ గిన్నిస్ రికార్డు మైలురాయిగా నిలిచింది. భగవద్గీత శ్లోక పఠన కార్యక్రమం విద్యార్థుల జీవనశైలిని మార్చడం ద్వారా సమాజానికి స్ఫూర్తిగా నిలిచింది. భవిష్యత్తు లక్ష్యం మాస్టర్ మైండ్స్ స్కూల్ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషిని అభినందిస్తూ, ప్రతి విద్యార్థి భగవద్గీతను పఠనాన్ని తమ జీవితంలో భాగంగా మార్చుకోవాలని పిలుపునిచ్చింది.

## ఎడిఫై పాఠశాల కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ ధర్నా



**మేడ్చల్, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** మేడ్చల్ మండలంలోని ఎల్లంపేట గ్రామంలో పాడిపంట పరిశ్రమను పాఠశాల భవనంగా ఎలాంటి అనుమతులు లేకుండా అడ్మిషన్లు నిర్వహిస్తున్నటువంటి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు సరైన భవనం లేకుండానే మేడ్చల్ పట్టణంలో కార్యాలయం ప్రారంభించి అడ్మిషన్లు స్వీకరిస్తున్నారని అన్నారు. కంపెనీ బిల్డింగ్లో పాఠశాల నిర్వహించడం ఏంటని నిలదీశారు. విద్య అధికారుల కనుసంధానంలోనే గుర్తింపు లేని ఎడిఫై పాఠశాల అడ్మిషన్లు తీసుకుంటున్న చర్యలు తీసుకోక పోవడం సిగ్గుచేటు అన్నారు. పాఠశాల గుర్తింపు లేకపోయినా బిల్డింగ్స్ లేకపోయినా లక్షల రూపాయలు ఫీజు వసూలు చేస్తున్న ఎడిఫై పాఠశాల యజమాన్యంపై క్రిమినల్ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. గుర్తింపు లేని ఎడిఫై పాఠశాల దేశవ్యాప్తంగా అనేక బ్రాంచ్ లు ఉన్నాయని బూటక మాటలు చెబుతూ విద్యార్థి తల్లిదండ్రులను మాయమాటలు చెబుతూ అడ్మిషన్ తీసుకుంటున్న విద్యాధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. మేడ్చల్ లో ఉన్న ఎడిఫై పాఠశాల కార్యాలయాన్ని సీజ్ చేసిన ఎంఇఓ కార్యాలయ సిబ్బంది ఎడిఫై పాఠశాలపై చర్యలు తీసుకోకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కిరణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## జాతర ప్రశాంతంలో పోలీసుల పాత్ర కీలకం

### పోలీసులను సన్మానించిన గంగమ్మల కమిటీ సభ్యులు



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** శ్రీకాళహస్తి పట్టణంలో ఏడు గంగమ్మల జాతర ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది ప్రశాంతంగా నిర్వహించడంలో పోలీసుల పాత్ర కీలకమని గంగమ్మల కమిటీ సభ్యులు తెలిపారు. ఆ మేరకు శుక్రవారం బేరివారి మండపం గంగమ్మ కమిటీ సభ్యులు దుర్గాప్రసాద్, వజ్రం కిషోర్, వినయ్ లు డీఎస్పీ నరసింహమూర్తి, టూటౌన్ సీఐ వెంకటేశ్వర్లును సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గంగమ్మ ప్రసాదాలను వారికి అందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ జాతరలో అల్లర్లు, గొడవలు జరగడం ఇదివరకు జరిగేవని, ఇప్పుడు అటువంటి వాటికి తావులేకుండా భక్తిభావంతో ఈ ఏడాది జాతర సంబరం అంబరాన్ని అంటిందన్నారు. ప్రజలు మెచ్చుకునేలా జరిగిన ఈ జాతర వేడుకకు శాంతిభద్రతల పర్యవేక్షణలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. దేవస్థానం అధికారులు కూడా జాతర విజయవంతంలో తమవంతు కృషి చేశారని తెలిపారు. అలాగే పారిశుధ్య నిర్వహణలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పనితీరు అభినందనీయమని కొనియాడారు. అందరి సమిష్టికృషే ఈ ఫలితంగా పేర్కొన్నారు.

## కపిలతీర్థం శిఖరం పై కృత్తికా దీపోత్సవం



**తిరుపతి, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** తిరుపతి కపిల తీర్థం కొండ చక్రంపై కార్తీకదీపం మహొూత్సవమును స్థానిక గాండ్ల కులస్తులు అందరూ కలిసి దీపాలను వెలిగించారు. తిరుపతి గాండ్ల మిట్ట వీధి వారి ఆధ్వర్యంలో గత 150 సంవత్సరాల నుండి స్థానిక గాండ్ల కులస్తులు కార్తీక మాసంలో వచ్చు కృత్తికా దీపోత్సవంను పురస్కరించుకుని కపిలతీర్థం కొండ శిఖరము నందు కృత్తికా దీపోత్సవ జరుపుట ఆనవాయితీని పురస్కరించుకొని గా వెలిగిస్తున్న నేపథ్యంలో ఈ కూడా కార్తీక దీపారాధన చేయడం జరిగినది. అత్యంత భక్తి శ్రద్ధలతో గాండ్ల కులస్తులు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శివ నామ స్మరణతో ప్రపంచ శాంతి కోరుకుని తీర్థ ప్రసాదాలు పంపిణీ చేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో పాతలపాటి శేఖర్, పాతలపాటి ప్రసాద్ బాబు, బండారు శ్రీనివాసులు, రామచంద్ర, దాము, రాజేంద్ర బాల తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠ ద్వార దర్శనాన్ని స్థానికులకు కల్పించాలి

### టీటీడీని కోరిన జనసేననేత కిరణ్ రాయల్




**తిరుపతి, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** కూటమి పాలన వచ్చాక ప్రతినెల మొదటి మంగళవారం స్థానికులకు తిరుమల వెంకటేశ్వర స్వామి దివ్య దర్శనాన్ని కల్పించడం, సంతోషకరమని అదేవిధంగా రానున్న వైకుంఠ ఏకాదశి, ద్వాదశి ఈ రెండు రోజులలో రోజుకు 20వేల మంది స్థానిక భక్తులకు టికెట్లు కేటాయించాలని జనసేనపార్టీ తిరుపతి నేత కిరణ్ రాయల్ టిటిడి పాలకమండలిని అభ్యర్థించారు. తిరుపతి ప్రెస్ క్లబ్ లో శుక్రవారం మీడియా ముందు జనసైనికులతో కలిసి కిరణ్ మాట్లాడుతూ గత ఫ్యాన్ పార్టీ ప్రభుత్వంలో ఈ దివ్యదర్శనాలను తమిళనాడు, కర్ణాటక, గుజరాత్ తదితర రాష్ట్రా వారికి 90 శాతం టికెట్లను బ్లాక్ లో విక్రయించి వెంకన్న దర్శనాన్ని స్థానికులకు అందనివ్వకుండా దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ విషయంపై తాను టీటీడీ చైర్మన్, ఈవోలను కలిసి కోరుతానని ఈ మంచి నిర్ణయాన్ని వారు కాదనరని మీడియాకు తెలియజేశారు. మీడియా సమావేశంలో కిషోర్, మనోజ్,సాయిదేవ్,ఆది, పురుషోత్తం,సాయి,సుధ,శేషాద్రి, పవన్ తదితరులు పాల్గొన్నారు..

## సీఎం కప్ విజేతలు గంగదేవిపల్లి విద్యార్థులు



**వరంగల్, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** వరంగల్ ఉమ్మడి జిల్లాలోని గీసుకొండ పాఠశాల ఆవరణలో ఈనెల 10 ,11, 12 తేదీలలో జరిగిన సీఎం కప్ గీసుగొండ మండల స్థాయి ఆటల పోటీలలో జెడ్.పి.హెచ్.ఎస్ గంగదేవిపల్లి పాఠశాల విద్యార్థులు అథ్లెటిక్స్ 100 మీటర్ల పరువు పందెంలో విభాగం లో పొలిశెట్టి అమ్ములు 9వ తరగతి ప్రథమ స్థానం పొంది గోల్డ్ మెడల్ సాధించారు ,200 మీటర్ల పరుగు పందెంలో బైకని పల్లవి 8 వ తరగతి ప్రథమ స్థానం పొంది గోల్డ్ మెడల్ సాధించారు,పొలిశెట్టి అమ్ములు 9వ తరగతి విద్యార్థిని 200 మీటర్ల పరుగు పందెం లో ద్వితీయ స్థానం సాధించింది. విద్యార్థులను ,ఫిజికల్ ఎడ్యూకేషన్ ఉపాధ్యాయులు తాళ్లపెల్లి రాజన్న ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ రజాక్ ఉపాధ్యాయులు కె.శ్రీనివాసచార్యా కె.వెంకటేశ్వర్లు ఏ.స్వరూప రాణి జె.రతన్ సింగ్ ఎన్.అనిత బి.మాధురి ఏ.కుమారస్వామి లు వీరిని అభినందించారు.

# అల్లు అర్జున్ అరెస్ట్ ను సమర్ధించిన ఆర్‌పిఐ

**రాష్ట్ర అధ్యక్షులు పిట్టావర ప్రసాద్**



**గోకవరం, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** సినీ నటుడు అల్లు అర్జున్ అరెస్టును సమర్ధించిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు పిట్టా వరప్రసాద్. ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో నిర్మించిన చిత్రంలో ఎర్ర చందనం స్మగ్లర్ గా నటించిన అల్లు అర్జున్ కు నాంపల్లి కోర్టు రిమాండ్ విధించడం చట్టం ముందు అందరూ సమానమే అని నిరూపితం అయిందన్నారు. తన సినిమా ప్రమోషన్ లో భాగంగానే హైదరాబాద్ సంధ్య థియేటర్ లో బెనిఫిట్ షో కి రావడం జరిగింది అన్నారు. దీనికోసం ముందుగానే పెద్ద ఎత్తున ప్రచారం జరిగిందన్నారు. అత్యధిక ఫాలోయింగ్ గలిగిన హీరోతో కలసి సినిమా చూద్దామని ప్రజలు వస్తారని ఆయనకు తెలియదా అన్నారు. ఈ సందర్భంగా జరిగిన తోక్కి సలాటలో ఒకరు మృతి చెందడం, మరొకరు గాయపడి చికిత్స పొందుతూ ఉండడం జరిగిందన్నారు. ఈ ఘటన జరిగిన సినిమా పూర్తి అయ్యేవరకు లోపలనే ఉండటం ఆయనకు ప్రాణం కంటే పైసలు పరమార్ధం అని అర్ధమైంది అన్నారు. ఒక్క సినిమాకు 100 కోట్లు వరకు తీసుకునే హీరో తన వల్ల ఒక ప్రాణం పోతే తనకు సంబంధం లేనట్లు కోర్టులో వాదనలు వినిపించడం హాస్యాస్పదమన్నారు. మానవత్వం లేని ఈ హీరోకు, జాతీయ అవార్డు ఇవ్వడం దురదృష్ట కరమని ఆయన అన్నారు. గతంలో చాలామంది హీరోలు ప్రేక్షకులు తన సినిమా పట్ల ఏ విధంగా రెస్పాండ్ అవుతున్నారో తెలుసుకోవడానికి థియేటర్లకు వచ్చినప్పుడు సినిమా మొదలైన తర్వాత ఈ విధమైన హంగు ఆర్భాటం లేకుండా ప్రేక్షకులకు ఏ విధమైన ఇబ్బంది కలగకుండా వచ్చి చూసేవారన్నారు. దీనికి భిన్నంగా ఆయన ర్యాలీగా రావడం సరి కాదన్నారు. తప్పు కప్పిపుచ్చు కోవడానికి బెయిల్ పొందడానికి పోలీసుల పైన రాష్ట్ర ప్రభుత్వం పైన నెపం నెట్టడం హాస్యాస్పదం అన్నారు.

# 17న... ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం



**సిరిసిల్ల, డిసెంబర్ 13(నిఘా న్యూస్):** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మార్గదర్శక సూత్రాల కనుగుణంగా శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల బిక్షపతి మాదిగ ఆధ్వర్యంలో అనుబంధ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర నాయకుడు ఆవునూరి ప్రభాకర్ మాదిగ హాజరయ్యారు. ఈ సమావేశంలో లక్ష్మణ్ మాదిగ మాట్లాడుతూ ఈ నెల తేది 17మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో అనుబంధ సంఘాల రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు,అట్టి సమావేశానికి ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా రావడం జరుగుతుందని తెలిపారు. కావున రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నూతన మండల అధ్యక్షులు, కార్యదర్శులు, నాయకులు తరలి రావాలని వెల్లడించారు. నూతన కమిటీల నిర్మాణంలో భాగంగా జిల్లా కో కన్వీనర్లుగా ఇల్లంతకుంట మండలానికి చెందిన రాకేష్ మాదిగ, చందుర్తి మండలానికి చెందిన ఆనంద్ మాదిగలను నియమించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి జిల్లా అధికార ప్రతినిధి రాజు మాదిగ జిల్లా సీనియర్ నాయకులు వెంకట్రాములు మాదిగ, దేవయ్య మాదిగ,చందుర్తి మండల కార్యదర్శి శ్రీనివాస్ మాదిగ,మహేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న సంతాన లేమి సమస్య

**సంతాన సాఫల్య వైద్య నిపుణులు డాక్టర్ సి. సబిత**




**హైదరాబాద్, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** ఆధునిక యుగంలో మారుతున్న జీవనశైలితో సంతాన లేమి సమస్య అధికం అవుతుందని సంతాన సాఫల్య వైద్యనిపుణులు, ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ సి. సబిత వెల్లడించారు. సంతానలేమి సమస్యకు పీసీఓడీ సైతం ఒక కారణమని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని అమీర్ పేట్ జనరల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రావుఫ్, ఆర్. ఎం. ఓ డాక్టర్ వినాయక్ రావ్ ఆధ్వర్యంలో ప్రసూతి వైద్య విభాగానికి సందర్శించిన మహిళలకు, గర్భిణీ స్త్రీలకు తనతో పాటు ప్రసూతి వైద్య నిపుణులు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో అధిక శాతం మహిళలు సంతానలేమి సమస్యతో ఆసుపత్రికి సందర్శిస్తున్నారని తెలిపారు. సంతానలేమి సమస్యకు కారణాలు తెలిపారు. సంతానలేమి సమస్యలు మగవారిలో, ఆడవారిలో సమానంగా ఉంటాయని స్పష్టం చేశారు. 30శాతం మహిళల్లో సమస్య ఉంటే, 30 శాతం మగవారిలో సైతం సమస్య ఉంటుందని అన్నారు. 40 శాతం ఇతరత్రా కారణాలు ఉంటాయని చెప్పారు. బయటి ఆహారం తినడం, ఉద్యోగరీత్యా ఒత్తిడికి గురి కావడం, ప్రెగ్నెన్సీని వాయిదా వేయడం, 30 సంవత్సరాలు పైబడిన తర్వాత వివాహం చేసుకోవడం, థైరాయిడ్ సమస్య, ఇవి కాకుండా కొందరిలో జన్యుపరంగా సమస్య ఉంటుందని కారణాలు వివరించారు. పాటించవలసిన ఆరోగ్య పద్ధతులను వెల్లడించారు. పోషక విలువలు కలిగిన ఆహారం సమయానుసారంగా సమతుల్యంగా భుజించాలని సూచించారు. నిత్యజీవితంలో ఒత్తిడికి కాకుండా చూసుకోవాలి. ప్రెగ్నెన్సీ వాయిదా వేయకూడదని హితబోధ చేశారు. వివాహమైన అనంతరం రెండు సంవత్సరాల లోపు సంతానం కానీ వారు అర్హత లేని డాక్టర్లను సంప్రదించకుండా, నాటు వైద్యం చేసుకోకుండా నేరుగా సంతాన సాఫల్య వైద్య నిపుణులను సంప్రదించడం ఉత్తమం అన్నారు. సంబంధిత వైద్య నిపుణులను సంప్రదిస్తే స్త్రీల హార్మోన్ల పరీక్షలు చేయడం, అల్ట్రా సౌండ్ స్కానింగ్, థైరాయిడ్ పరీక్షలు. మధుమేహ వ్యాధి పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. ఆడవారితో పాటు మగవారికి సైతం తదితర వైద్య పరీక్షలు చేయించడం జరుగుతుందని స్పష్టం చేశారు. లోపాలు ఎవరిలో ఉన్నా కానీ వైద్య చికిత్స అందించి, సంతానం అయ్యే విధంగా కృషి చేస్తామని సంతానం కానీ మహిళలకు భరోసా కల్పించారు.

# ఇదిగో అక్రమ లే అవుట్...

## యధావిధిగా రిజిస్ట్రేషన్లు అధికారులకు లంచాలు

- గోల్నాక అశోకానగర్‌లో అనుమతులు లేకుండా వెంచర్ ఏర్పాటు
- గుట్టు చప్పుడు కాకుండా ప్లాట్ల విక్రయం
- పట్టించుకోని జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ, రెవెన్యూ శాఖలు





**అంబర్‌పేట, డిసెంబర్ 13(నిఘా న్యూస్):** జిహెచ్ఎంసి అంబర్ పేట సర్కిల్-16 పరిధిలోని గోల్నాక డివిజన్ అశోకానగర్‌లోని విశాలమైన స్థలం లో ఉన్న షెడ్లను కూల్చి అనుమతి లేకుండా వెంచర్ ఏర్పాటుచేసి విలువైన స్థలాలను అమ్ముతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ, రెవెన్యూ శాఖల నుంచి అనుమతులు లేకుండా ఇక్కడ గుట్టు చప్పుడు కాకుండా లేఅవుట్ చేసి ప్లాట్లను విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జిందా తిలస్మాత్ కారా?నాకు వెనకవైపు అశోకానగర్ లో బీడ్ ఫ్యాక్టరీ యజమానికి స్థలం ఉంది. అక్కడ గత కొన్ని ఏళ్ళు గా బీడ్ ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులు షెడ్లు వేసుకొని ఉండేవారు. అయితే ఇటీవల సదరు యజమాని షెడ్లను కూల్చివేసి భూమిని చదును చేసి అక్కడ వెంచర్ చేసి ప్లాట్లను విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సదరు స్థల యజమాని ఎలాంటి అనుమతి లేకుండా 2019.77 చదరపు గజాల స్థలాన్ని 17 ప్లాట్లుగా విభజించి గజానికి 80 వేల రూపాయల చొప్పున విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జనవాసాల మధ్య ఉన్న స్థలాన్ని యజమాని ఎలాంటి అనుమతి లేకుండా ప్లాట్లుగా చేసి బహిరంగంగా విక్రయిస్తున్న జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ, రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మూడేళ్ళ క్రితం క్రితం ఇదే అశోకానగర్ లోని అశోకా బిస్కెట్ ఫ్యాక్టరీకి చెందిన స్థలాన్ని యజమానులు గుట్టు చప్పుడు కాకుండా ప్లాట్లుగా చేసి విక్రయించారని వారు గుర్తు చేశారు. అనుమతులు లేకుండా విక్రయించిన ఈ స్థలంలో ప్రస్తుతం బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయని వారు తెలిపారు.

అనుమతులు లేకుండా విక్రయించిన ప్లాట్లను కొనుగోలు చేసిన యజమానులు తమకు కనీస సౌకర్యాలు కల్పించాలంటూ ఒత్తిడి తెస్తున్నారని వారు తెలిపారు. ఇప్పటికీ ఈ ఇక్కడ రోడ్డు ఏర్పాటు జరగలేదని మట్టిరోడ్డే కొనసాగుతుందని పలువురు తెలిపారు. అదే పరిస్థితి ప్రస్తుతం అశోకా నగర్ ప్లాట్లను కొనుగోలు చేసిన వారు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు గుర్తు చేశారు. జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ, రెవెన్యూ శాఖల అనుమతులు లేకుండా నిబంధనకు విరుద్ధంగా ప్లాట్లను విక్రయిస్తున్న వారి వద్ద స్థలాలను కొనుగోలు చేసిన వారు కనీస సౌకర్యాలపై ప్రశ్నించడం తగదని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుని అనుమతి లేకుండా లే అవుట్ చేసే విక్రయిస్తున్న స్థలాన్ని కొని మోసపోతున్న సామాన్యులను రక్షించాలని పలువురు కోరారు.

## విలీన గ్రామాలపై...

# మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ల పెత్తనమేంది

**పంచాయతీ అనుమతులను తప్పుపడుతూ వసూళ్లకు పాల్పడుతున్న నేతలు..?**




**ఘట్‌కేసర్, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** ఇటీవల కాలంలో సర్పంచ్, వార్డు సభ్యుల పదవీ కాలం పూర్తి కావడంతో ఘట్కేసర్ మండల పరిధిలోని ప్రతాప సింగారం, కాచవాని సింగా, కొర్రేముల, చౌదర్ గూడా, వెంకటాపురం గ్రామాలను పోచారం మున్సిపాలిటీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విలీనం చేసిన సంగతి తెలిసిందే. దీంతో పోచారం మున్సిపల్ చైర్మన్, పలువురు కౌన్సిలర్లు మా గ్రామాలకు వచ్చి పెత్తనం చెలాయించడం ఏమిటనీ, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. ఇన్నాళ్లు మా గ్రామాలను మేమే అభివృద్ధి చేశాం, మీరు కొత్తగా వచ్చి చేసేదేమిటి అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మీ రాక అభివృద్ధి కోసం కాదు, వసూళ్ల కోసమే అనేది స్పష్టంగా తెలుస్తుందని పలువురు విమర్శిస్తున్నారు. పోచారం మున్సిపాలిటీలో దోచుకున్నది సరిపోక మా గ్రామాలలో దోచుకోవడానికి ఏ మొహం పెట్టుకొని వస్తున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. మేము ఇచ్చిన అనుమతులను తప్పుబడుతూ గృహ యజమానుల దగ్గర దొరికినంత లాగుతున్నారని గ్రామాలలో జోరుగా ప్రచారం సాగుతుంది. కమిషనర్ కొంతమంది సిబ్బందిని కేవలం ఈ గ్రామాలలోనే తిప్పుతూ వసూళ్ల దందాకు పాల్పడుతున్నారని ఆయా గ్రామ ప్రజలు వాపోతున్నారు. పోచారం మున్సిపాలిటీ చైర్మన్ కౌన్సిలర్లకు మేమేమైనా ఓట్లు వేసి గెలిపించామా, మాపైన ఎందుకు వారు పెత్తనం చెలాయిస్తున్నారు?. ఇలాంటి ప్రశ్నలు గ్రామ గ్రామాన ప్రతి నోట వినబడుతున్న విమర్శలు. వీరికి కాంగ్రెస్ పార్టీ బడా నాయకుల హస్తం ఉందనేది ప్రజల్లో నాటుకపోయిన బలమైన అనుమానం!. వారే ఇదంతా చేయిస్తున్నారనే విమర్శ లేకపోలేదు. మేము ఇన్నాళ్లు పనిచేసే చివరకు చైర్మన్, కౌన్సిలర్ల రాజకీయం ముందు అవమాన పడుతున్నట్లు కొందరు వాపోతున్నారు. ఇకపై నుంచి మా గ్రామాలలో మీ పెత్తనం చెల్లదు, పెత్తనం చెలాయించాలని చూస్తే సహించేది లేదని పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు హెచ్చరించారు.

# ఎన్టీఆర్ విగ్రహానికి స్థానచలనం



**బోడుప్పల్, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద రోజు జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు శాశ్వత పరిష్కారం దిశగా నాలుగు సంవత్సరాలు కౌన్సిల్ సమావేశాలలో బీజేపీ కార్పొరేటర్ సామల పవన్ రెడ్డి పోరాడగా మేయర్ తోటకూర అజయ్ యాదవ్ స్పందించి ఎన్టీఆర్ విగ్రహ స్థాన మార్పిడి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# బిఆర్ఎస్ పార్టీకి 1400కోట్ల బ్యాంక్ బ్యాలెన్స్

- ఎక్కడి నుంచి వచ్చాయో వివరించాలని డిమాండ్
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**వేములవాడ, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి బ్యాంక్ బ్యాలెన్స్ రూ.1400కోట్లు ఎక్కడ్నుంచి వచ్చాయో చెప్పాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. ఈ స్థాయిలో ఏ పార్టీకీ లేవన్నారు. పదేళ్ల పాటు అక్రమాలకు పాల్పడి అడ్డంగా దోచుకున్నారని ఆరోపించారు. ఇక ప్రతిపక్ష పాత్ర పోషించడం చేతకావట్లేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. అందుకే పేటీఎం రైటర్లు రాసిన లేఖలు విడుదల చేస్తున్నారని మండిపడ్డారు. గురువారం ఆయన హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడుతూ మతిలేని మాటలతో రాహుల్ గాంధీకి కేటీఆర్ లేఖ రాశారన్నారు. 18 గంటల పాటు పని చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అక్కసు తోనే కేటీఆర్ లేఖ రాశాడన్నారు. ప్రజా పాలనలో ప్రజలంతా సుఖ సంతోషాలతో చూసి ఓర్వలేకపోతున్నారన్నారు. కేటీఆర్ రాసింది రోతలని విమర్శించారు. తెలంగాణ ఆడబిడ్డలను స్వయం సహాయక సంఘాల ద్వారా కోటీశ్వరులను చేస్తున్నంకు కేటీఆర్ ఏడుస్తున్నాడన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకు సిలిండర్ వంటి స్కీమ్ లు అందజేస్తున్నందుకు కేటీఆర్ ఆందోళతో ఉన్నారన్నారు. కిరీటాలు, వడ్డాణాలు, నగలు పెట్టి తెలంగాణ తల్లిని మార్చింది బీఆర్ ఎస్ పార్టీ కాదా అంటూ ప్రశ్నించారు. తెలంగాణను పదేళ్ల పాటు అడ్డంగా దోచుకున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా పెట్టాలన్న సోయి ఎందుకు లేకపోయిందని ప్రశ్నించారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని చూసి ప్రతి ఒక్కరు తమ ఆడబిడ్డలా ఉన్నదని సంతోష పడుతున్నారన్నారు. తెలంగాణ అస్థిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని తమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాపాడుతున్నారన్నారని అన్నారు.

# భర్త వేధింపులతో వివాహిత ఆత్మహత్య

**మియాపూర్ పీఎస్ పరిధిలో ఘటన**



**శేరిలింగంపల్లి, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** దంపతుల మధ్య కలహాల నేపథ్యంలో వివాహిత విషం సేవించి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏపీలోని ఏలూరు జిల్లా చాట్రాయి మండలానికి చెందిన మొక్కపాటి వెంకట నాగలక్ష్మి (29) సాఫ్ట్ వేర్ ఇంజనీర్. ఐదు నెలల క్రితం అదే జిల్లా ముసునూరు మండలం తోచిలుకకు చెందిన మొవ్వ మనోజ్ మణికంతతో వివాహమైంది. మనోజ్ కాంట్రాక్టర్ గా విధులు నిర్వర్తిస్తూ మియాపూర్‌లోని గోకుల్ ప్లాట్స్‌లో ఉంటు న్నారు. బుధవారం విషం తాగడంతో గమనించిన ఇంటి యజమాని కుటుంబసభ్యులు కేపీహెచ్బీలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గురువారం మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులు మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త వేదింపులతోనే తన కుమార్తె మృతి చెందిందని ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

# నాలాపై నిర్మాణాలు ఏటా మునుగుతున్న బస్తీలు





**అనుమతులు లేకుండానే యధేచ్చగా నిర్మాణాలు**

**ఇల్లందు, డిసెంబర్ 13 (నిఘా న్యూస్):** ఇల్లందు మండలం సుదిమళ్ళ గ్రామపంచాయతీ పరిధిలో వర్షాకాలంలో ఊర గుట్ట నుండి వచ్చే వరద కాలువ పై కొందరు గుట్టు సప్పుడు కాకుండా ఎలాంటి అనుమతులు లేకున్నా మట్టి తరలించారు. నాలాలపై నిర్మాణం చేపట్టేందుకు పూనుకోవడంతో ఇట్టి విషయం పంచాయతీ అధికారి దృష్టికి వెళ్లగా,నాలాపై నిర్మాణానికి( నాలా) నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ అసెస్మెంట్. సర్టిఫికెట్ పంచాయితీ అనుమతి తీసుకోవాలని సుచించారు.

అధికారి మాటలను పెడచెవిన పెట్టిన నిర్మాణదారులు పంచాయతీ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తిస్తూ పంచాయితీ నోటీసును సైతం లెక్క చేయలేదంటూ స్థానికులు ఆరోపించారు. సుదిమళ్ళ పంచాయితీ పరిధి ఫిఫ్త్ షెడ్యూల్ ప్రాంతం అయినప్పటికీ 1/70 పెసా చట్టాలు అమల్లో ఉన్న వాటిని ఉల్లంఘిస్తూ గిరిజనేతరులు సేద్యం చేసే ఆదివాసి భూములను బినామీ పేర్లతో కొనుగోలు చేస్తూ నాలాలను ఆక్రమించి రెవెన్యూ పంచాయతీ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రతి ఏటా వర్షాకాలంలో గుట్ట నుండి వచ్చే వరద ఉధృత కారణంగా వచ్చిన వరద నీటితో రాకపోకలు స్తంభించి, రైతుల పంటభూములు నీట మునిగి ప్రతి ఏటా నష్టం వాటిల్లుతుందంటూ రైతులు వాపోయారు. ఇట్టి వరద కారణం చేత రహదారి మొత్తం జలమయం అయి ఐదు గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందంటూ పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నాలాలపై నిర్మిస్తున్న నిర్మాణాలను తొలగించి. ఇప్పుడు కట్టే నిర్మాణాలను నిలుపుదల చేసి వర్షాకాలంలో గుట్ట నుండి వచ్చే వరద నీళ్లు సజావుగా పోయేవిధంగా చూడాలని కోరారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com